

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 239 పేజీలు - 08 వెల - 05/-

మంగళవారం 25-08-2026


పోతిరెడ్డిపాడు వద్ద వైసీపీ నేతల

**అడ్డగింత దారుణం**



# ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ జోడిద్దాం



ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

**అంతర్జాతీయ మార్కెట్లకు మన వ్యవసాయ ఉత్పత్తులు**

**ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో గ్లోబల్ బ్రాండ్లుగా మారాలి**

**దేశీయ రకం హైబ్రీడ్ పాప్ కార్న్ మొక్కజొన్న విత్తనాలు విడుదల**

నూజివీడు, ఆగస్టు 24: మన రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ప్రక్రియను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ముసునూరు వద్ద గార్మె పాప్ కార్నికా నాన్ జీఎంఓ హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్నికా సంస్థ ఏర్పాటు చేసి దేశంలోనే అతిపెద్ద జన్యుమార్పిడి కాని ఎక్స్ పాండబుల్ పాప్ కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఉపరాష్ట్రపతితో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ..." రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని




ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు.

మిగతా 2లో

## రైతుల విజయాలను అభినందించిన ఉపరాష్ట్రపతి

● ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసలు ● రాష్ట్ర ప్రగతిని కాంక్షించే జాతీయవాది అంటూ కితాబు ● ముసునూరులో నాన్-జీఎంఓ పాప్‌కార్న్ విత్తన రకాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి ● రైతులే దేశానికి వెన్నెముక అని స్పష్టం చేసిన రాధాకృష్ణన్




2

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి

## కొత్త పార్టీ పేరు, జెండా వెల్లడిస్తా: విజయసాయి

- పార్టీ పేరు, జెండా, విధివిధానాలపై క్లారిటీ ఇచ్చిన విజయసాయిరెడ్డి
- విజయవాడ వేదికగా పూర్తి వివరాలను వెల్లడిస్తానన్న విజయసాయి
- ప్రజల గొంతుక వినిపించేందుకు ప్రతిపక్ష హోదా అక్కర్లేదని వ్యాఖ్య



2

తాను కొత్త పార్టీని ప్రారంభించపోతున్నట్టు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విషయానికి సంబంధించి ఆయన ఈరోజు మరింత క్లారిటీ ఇచ్చారు. శ్రావణమాసం మూడో శుక్రవారం నాడు తన నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పేరు, జెండా, విధివిధానాలు మరియు పూర్తి ప్రణాళికను విజయవాడ వేదికగా అధికారికంగా వెల్లడిస్తానని ఆయన స్పష్టం చేశారు.




## ఫీజు బకాయిల రగడ..

**హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష**

● ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం బీజేపీ నేత రాంచందర్ రావు దీక్ష ● రూ. 15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల విద్యార్థులకు నష్టమని ఆరోపణ ● రాంచందర్ రావుది రాజకీయ డ్రామా అని కొట్టిపారేసిన మంత్రి పొన్నం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం హైదరాబాద్‌లో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని,

మిగతాది 2లో

ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు..

## సాదిక్ ఖాన్‌కు రిమాండ్

- బాధితుల కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి
- సాదిక్ ఖాన్ వేధింపులే ఆత్మహత్యలకు కారణమని తీవ్ర ఆరోపణ
- 10 మందితో టెర్రరిస్ట్ గ్యాంగ్ ఏర్పాటు చేసి వేధిస్తున్నాడన్న విజయసాయి
- ఇది లవ్ జిహాద్ అని, గత ప్రభుత్వ హయాంలోనే మొదలైందని వ్యాఖ్య
- ఈ కేసులో ఇప్పటికే అరెస్టయి విచారణలో ఉన్న నిందితుడు సాదిక్



రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఘటన జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అతడిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు, సోమవారం కాకినాడకు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. సాదిక్ ఖాన్ వేధింపుల కారణంగానే నూకరాజు కుటుంబం బలవన్మరణానికి పాల్పడిందని కాకినాడ ఎస్పీ బిందుమాధవ్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. కేసు దర్యాప్తు వివరాలను ఎస్పీ వెల్లడిస్తూ.. రెండు ఆత్మహత్య లేఖలు ఈ కేసులో కీలక ఆధారాలుగా నిలిచాయని తెలిపారు. నూకరాజు రాసిన లేఖతో పాటు, ఆయన కుమార్తె సౌజన్య స్కూటీలో లభించిన మరో లేఖలోనూ సాదిక్ ఖాన్ పేరు స్పష్టంగా ఉందని చెప్పారు. అతని వేధింపులు భరించలేకే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారని, ఈ ఆధారాలతోనే దర్యాప్తును ముమ్మరం చేశామని వివరించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఇతర లేఖల గురించి తాము ఇప్పుడేమీ చెప్పలేమని, పక్కా ఆధారాలతోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు.

మిగతాది 2లో

**కెనడా దిగుమతులపై 50 శాతం సుంకాలు..**



వచ్చే ఏడాది జనవరి 1 నుంచి కొత్త టారిఫ్‌లు అమలు

కెనడా వల్లే తమకు వాణిజ్య లోటు వస్తోందన్న ట్రంప్

అమెరికా నిర్ణయంపై ప్రతీకార చర్యలకు కెనడా సిద్ధం

అమెరికా, కెనడా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. కెనడా నుంచి దిగుమతి అయ్యే కార్లు, ట్రక్కులు, వాహన విడిభాగాలు, ఉక్కుపై ఏకంగా 50

## అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై సీఎం ఆగ్రహం

రాజకీయ కారణాలతో అడ్డుకోవడం తెలంగాణకు అవమానమని వ్యాఖ్య

2

- పర్యటన వివరాలన్నీ కేంద్రానికి ముందే అందించామని వెల్లడి
- తెలంగాణ పట్ల వివక్ష చూపొద్దని కేంద్రానికి సూచన
- పెట్టుబడుల కోసం అమెరికా పర్యటన చేపట్టామని స్పష్టీకరణ
- గుజరాత్‌కు అనుమతించి తెలంగాణకు నిరాకరించడంపై ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 24: తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ కోసం చేపట్టిన తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైజింగ్--2047 దార్శనికతలో భాగంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు స్పష్టమైన లక్ష్యంతో చేపట్టిన పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ పట్ల వివక్ష చూపడమేనని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు.




## మద్యం రవాణా కేసులో కారుమూరికి రిమాండ్

- మద్యం రవాణా కేసులో కారుమూరికి జ్యుడిషియల్ కస్టడీ
- 14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు
- హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలింపు
- మద్యం రవాణా కేసులో ఈడీ అదుపులోకి తీసుకున్న వైనం
- ఆదివారం రాత్రి అరెస్ట్, సోమవారం కోర్టులో హాజరు




2

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుకు నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం ఆయన్ను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ జోడిద్దాం

17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్



జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు. యాంత్రీకరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్ కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలి. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. కొండవీటి కొయ్య బొమ్మలు లాంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు వెళ్లాలి. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతుల్ని ఎంట్రప్రెన్యూర్లుగా చూస్తున్నాం. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మిరప, మొక్క జొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విలువ జోడించి ఓ మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ప్రాసెసింగ్ పెరిగితేనే ఉత్పత్తులకు విలువ**

"ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వాటిలో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నాం. ప్రాసెసింగ్ పెంచితే అధిక సంపదను ఆర్జించే ఆవకాశం ఉంటుంది. ప్రత్యేకించి యువత ఈ రంగంపై దృష్టి పెట్టాలి. ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామిక వేత్త రావాలి. మన వద్ద ఉత్పత్తి అయ్యే వాటిని గ్లోబల్ ప్రాడెక్టుగా అభివృద్ధి చేయాలి. ఆహారపు అలవాట్ల అనుగుణంగా పంటలు కూడా మారాలి. నూజివీడు వద్ద ఇప్పుడు పామాయిల్, కోకో ఆక్వా లాంటి వాణిజ్య పంటలు పెరిగాయి. వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల్లో మనం అగ్రగామిగా మారాం. వచ్చే 20-30 ఏళ్లలో ఎలాంటి పంటలు ఉండాలి, ఎలాంటి ఆర్థిక వ్యవస్థ ఉండాలో మనం నిర్దేశించు కుందాం. రాయలసీమను కూడా ఉద్యాన పంటల హబ్ గా మార్చేలా కార్యాచరణ చేపట్టాం. రూ.1 లక్ష కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను అభివృద్ధి చేస్తున్నాం. రూ.35 వేల కోట్లతో 36 సాగు ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తాం. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడాం. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఈ ప్రాంత భవిష్యత్తు కూడా మారుతుంది. వెలిగొండ ప్రాజెక్టు ను ఈ నెలాఖరులోనే ప్రారంభించి మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాకు నీరు ఇస్తాం. ఎల్ నినో వల్ల నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. పప్పు ధాన్యాల లాంటి ప్రత్యామ్నాయ పంటలు వేసేలా చర్యలు చేపట్టాం. రైతులు కూడా సహకరించి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిస్తున్నాను. నీటి భద్రత సాధించి ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చేలా చర్యలు చేపడతాం. దేశం అంతా నదుల అనుసంధానం జరిగి నీటి సద్వినియోగం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన. గోదావరి- కృష్ణా, తుంగభద్ర, పెన్నా-కావేరీ నదులను అనుసంధానించటం ద్వారా 4 రాష్ట్రాల్లో సమస్య పరిష్కారం అవుతుంది. కష్టకాలంలో అన్ని ప్రాంతాల్లో ఆయకట్టు స్థిరీకరణ, తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. గంగా, మహానది, గోదావరి నదుల్ని కూడా అనుసంధానించుకుంటే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోగలం. అప్పుడు దేశానికి తిరుగులేదు. నీటి భద్రత సాధిస్తే దేశ అభివృద్ధి అన్ స్టాపబుల్." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నారాలోకేష్, కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి తదితరులు హాజరయ్యారు.

# ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు.. సాదిక్ ఖాన్‌కు రిమాండ్

ఘటన అనంతరం సాదిక్ తన ఫోన్లను స్విచాఫ్ చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకునేందుకు 10 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి, ఐదు రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలించారు. చివరకు మీరట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ, ఐదుగురు సీఐలతో కూడిన బృందం సాదిక్‌ను విచారించింది. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో అతడిని కాకినాడ సబ్ జైలుకు తరలించారు. మరిన్ని వివరాలు రాబట్టేందుకు మంగళవారం కస్టడీ పిటిషన్ దాఖలు చేస్తామని, కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. సాదిక్ నిర్వహిస్తున్న షూటింగ్ అకాడమీపైనా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కీలక సూచన చేసిన ఎస్పీ.. వేధింపులు ఎదురైనప్పుడు ప్రాణాలు తీసుకునే బదులు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి, వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసులో నూకరాజు కుటుంబం ముందుగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆయన పేర్కొనడం గమనార్హం. కాకినాడ ఫ్యామిలీ సూసైడ్.. ఇది లవ్ జిహాదే: విజయసాయి సంచలన ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఘటనలో రాజకీయ వేడి రాజుకుంది. నిందితుడు సాదిక్ ఖాన్ వేధింపుల వల్లే ఈ ఘోరం జరిగిందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఇది సాధారణ వేధింపుల కేసు కాదని, దీని వెనుక పక్కా ప్రణాళికతో కూడిన "లవ్ జిహాద్" ఉందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోనసీమ జిల్లా రావులపాలెంలో నూకరాజు అల్లుడు జగదీశ్వర్ రెడ్డి కుటుంబాన్ని, ప్రాణాలతో బయటపడిన చిన్నారి రియాన్ష్ కార్తికేయ రెడ్డిని విజయసాయిరెడ్డి పరామర్శించారు. ఆత్మహత్యలకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సాదిక్ ఖాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సాదిక్‌ను కరడుగట్టిన నేరస్థుడిగా అభివర్ణించిన ఆయన, కాకినాడ, రాజమండ్రి ప్రాంతాల్లో సుమారు 15 హిందూ కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నాడని ఆరోపించారు. సాదిక్, మరో తొమ్మిది మంది కలిసి ఒక 'టెర్రరిస్ట్ గ్యాంగ్'గా ఏర్పడ్డారని విజయసాయి ఆరోపించారు. మహిళలను లక్ష్యంగా చేసుకుని, బలవంతంగా ఇస్లాంలోకి మార్చడం, వారి ఆస్తులను కాజేయడమే ఈ ముఠా లక్ష్యమని అన్నారు. నూకరాజు కుటుంబానికి చెందిన రూ. 40 కోట్ల విలువైన ఆస్తులు, రావులపాలెంలోని 40 సెంట్ల భూమిని సాదిక్ బలవంతంగా రాయించుకున్నాడని తెలిపారు. వీటితో పాటు రూ. 2 కోట్ల బంగారం, రూ. 2 కోట్ల నగదు కూడా తీసుకున్నాడని ఆరోపించారు. గతంలో సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డికి విషం పెట్టి చంపి, ఆ ఇన్సూరెన్స్ డబ్బును కూడా సాదిక్ కాజేశాడని ఆయన చేసిన ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి.

ఆత్మహత్యకు ముందు సౌజన్య రాసిన లేఖలో అనేక కీలక విషయాలు వెల్లడయ్యాయని అన్నారు. విచారణలో తనకు ఇద్దరు వ్యక్తులు సహకరించారని సాదిక్ చెప్పినట్టు తనకు తెలిసిందని విజయసాయి పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఏపీలో లవ్ జిహాద్ మొదలైందని వ్యాఖ్యానించారు. త్వరలోనే విజయవాడలో కొత్త పార్టీ గురించి మాట్లాడతానని చెప్పారు.

ఘటన నేపథ్యం:

కాకినాడ అశోక్ నగర్‌లో నివాసముంటున్న పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు (61), తన భార్య మీనా (58), కుమార్తె సౌజన్య (38), మనవడు రియాన్ష్‌తో కలిసి ఆగస్టు 16న రాత్రి రాజమండ్రి రోడ్-కమ్-రైల్వే బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు, మత్స్యకారులు రంగంలోకి దిగారు. సుమారు 20 నిమిషాల పాటు ఈదుతూ సహాయం కోసం కేకలు వేసిన బాలుడు రియాన్ష్‌ను మత్స్యకారులు కాపాడారు. మిగిలిన ముగ్గురూ మృతి చెందారు. సాదిక్ ఖాన్ వేధింపులు భరించలేకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నూకరాజు, సౌజన్య రాసిన లేఖలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ లేఖల ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడు సాదిక్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

# రైతుల విజయాలను అభినందించిన ఉపరాష్ట్రపతి

అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం అడ్డురాదని, ఇదే ఆయనలోని గొప్పతనమని ప్రశంసించారు. ఏలూరు జిల్లా ముసునూరులో జరిగిన నాన్-జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ చంద్రబాబు పాలనా దక్షతపై ప్రశంసల జల్లు కురిపించారు. ముసునూరు గ్రామాన్ని ఒక విజయగాథగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇది భారతీయ రైతుల పురోగతికి సంబంధించినదని ఉపరాష్ట్రపతి అన్నారు. తన ప్రసంగంలో ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. "రెండు నెలల క్రితం 'దినమలర్' అనే తమిళ పత్రికలో మొక్కజొన్న పరిశ్రమలో పారిశ్రామికవేత్త పట్టాభి రామారావు సాధించిన అసాధారణ విజయాల గురించి చదివాను. ఒకే ఒక్క వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. వెంటనే ఆయనకు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాను" అని వివరించారు. ఆ తర్వాత పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్‌ను బహుకరించారని గుర్తుచేసుకున్నారు. ఈ ఘటన తర్వాత జరిగిన ఒక యాదృచ్ఛిక సంఘటనను ఉపరాష్ట్రపతి సభతో పంచుకున్నారు. కొద్దిరోజులకే ఉపరాష్ట్రపతి భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో పట్టాభి ఇచ్చిన పాప్‌కార్న్‌ను అందరికీ అందించానని తెలిపారు. ఒక భారతీయ రైతు వ్యవస్థాపక శక్తిని, ఆయన పండించిన ఉత్పత్తి సత్తాను చాటిచెప్పడానికే ఈ ఉదాహరణను చెబుతున్నానని రాధాకృష్ణన్ అన్నారు.

రైతులే ఈ దేశానికి వెన్నెముక అని ఆయన పునరుద్ఘాటించారు. జీడీపీ, అభివృద్ధి గురించి మనం మాట్లాడక ముందే తరతరాలుగా ఈ నాగరికతకు అన్నం పెట్టింది రైతేనని అన్నారు. "మన పండుగలు, పంచాంగాలు, కాలగమన భావన సైతం విత్తనం వేయడం నుంచి పంట కోయడం వరకు సాగిన వ్యవసాయ చక్రం ఆధారంగానే రూపుదిద్దుకున్నాయి. జనవరి 14న దేశమంతటా ఆంధ్రప్రదేశ్‌లో మకర సంక్రాంతి, పంజాబ్‌లో లోహ్రీ, తమిళనాడులో పొంగల్, అసోంలో బిహు అంటూ పంటల పండుగను జరుపుకుంటాం. ఇంతటి వైవిధ్యభరితమైన మన దేశాన్ని వ్యవసాయం ఏకం చేస్తోంది" అని ఆయన వివరించారు. ప్రస్తుత ధరల ప్రకారం దేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా దాదాపు ఐదో వంతు ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్నికా ఎండీ ఎస్పీబీ పట్టాభి రామారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కలిసి కొత్త వంగడాన్ని ఆవిష్కరించి, పలువురు రైతులను సత్కరించారు.

# కెనడా దిగుమతులపై 50 శాతం సుంకాలు.. ట్రంప్ సంచలన నిర్ణయం

అమెరికా, కెనడా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. కెనడా నుంచి దిగుమతి అయ్యే కార్లు, ట్రక్కులు, వాహన విడిభాగాలు, ఉక్కుపై ఏకంగా 50 శాతం మేర సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ కొత్త టారిఫ్‌లు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. తమ దేశ వ్యవసాయ ఉత్పత్తులపై కెనడా అధిక సుంకాలను విధిస్తోందని, దీనివల్ల అమెరికా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ట్రంప్ ఆరోపించారు. కెనడా వైఖరి కారణంగానే తమకు 60 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఏర్పడిందని ఆయన మండిపడ్డారు. ఇకపై కెనడాను ప్రత్యేక దేశంగా పరిగణించబోమని, వాణిజ్య వ్యవహారాల్లో ఆ దేశంతో కలిసి ముందుకు సాగడం కష్టంగా మారిందని వ్యాఖ్యానించారు. కెనడా వాణిజ్యంలో 95 శాతం వాటా అమెరికాతోనే ముడిపడి ఉందని, తమతోనే ఆ దేశానికి అత్యధిక అవసరం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, అమెరికాలో తయారైన వస్తువులకు మాత్రం ఈ సుంకాల నుంచి మినహాయింపు ఉంటుందని ఆయన వెల్లడించారు.

ఇరు దేశాల మధ్య ఇటీవల జరిగిన వాణిజ్య చర్చలు విఫలమవ్వడంతోనే ట్రంప్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ నిర్ణయంపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా స్పందించారు. అమెరికాపై ప్రతీకార సుంకాలను విధిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సుంకాలు సెప్టెంబర్ 8 నుంచే అమల్లోకి వస్తాయని ఆయన వెల్లడించారు. ఇప్పటికే కెనడాకు చెందిన 20 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై అమెరికా 50 శాతం సుంకాలను విధించిన నేపథ్యంలో, తాజా పరిణామాలతో ఇరు దేశాల మధ్య వాణిజ్య పోరు మరింత ముదిరే అవకాశం ఉంది.

## కొత్త పార్టీ పేరు, జెండా వెల్లడిస్తా: విజయసాయి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాసమస్యలపై పోరాడేందుకు, ప్రజల తరఫున గొంతుక వినిపించేందుకు చట్టసభల్లో ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని విజయసాయి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ మాత్రమే ఏకైక ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సమస్యలను నేరుగా సభల వరకు తీసుకెళ్లేందుకు ఒక బలమైన స్వతంత్ర రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

## మద్యం రవాణా కేసులో కారుమూరికి రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా విధానంలో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మద్యం రవాణా కేసులో విచారణ నిమిత్తం కారుమూరి నాగేశ్వరరావును ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. విచారణ అనంతరం ఆదివారం రాత్రి ఆయన్ను అరెస్ట్ చేశారు. అరెస్టుకు ముందు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత ఈడీ కార్యాలయానికి తరలించారు. సోమవారం ఉదయం కోర్టులో హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, కారుమూరికి 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల అనంతరం, పోలీసులు కారుమూరి నాగేశ్వరరావును చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. గత ఏపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం వ్యాపార కార్యకలాపాల్లో జరిగిన అవకతవకలపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ కేసులో కారుమూరి నాగేశ్వరరావును నిందితుడిగా పేర్కొన్నారు. ఆయన రిమాండ్‌తో ఈ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది.

## ఫీజు బకాయిల రగడ.. హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష

(మొదటి పేజీ తరువాయి)

నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇదే విద్యార్థులు త్వరలో ప్రభుత్వాన్ని గద్దె దించుతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణకు వచ్చి బకాయిలు విడుదల కోసం చొరవ చూపాలని సవాల్ విసిరారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ఈ డ్రామా: పొన్నం ప్రభాకర్ రాంచందర్ రావు దీక్షపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే రాంచందర్ రావు ఈ తరహా డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. చేతనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం తమ ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు బ్యాంకుల ద్వారా అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అలాగే, సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలవుతోందా అని ఆయన ప్రశ్నించారు.

## అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా పర్యటనకు సంబంధించి సమగ్ర వివరాలను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు ముందుగానే అందించామని రేవంత్‌రెడ్డి తెలిపారు. పర్యటనలో ఎలాంటి రహస్యాలు, దాపరికాలు లేవని స్పష్టం చేశారు. రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడమంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. తెలంగాణ పట్ల చిన్నచూపు తగదు తెలంగాణ పట్ల వివక్ష, చులకన భావం సరికాదని ముఖ్యమంత్రి అన్నారు. రాజకీయ కారణాలతో ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు అనుమతి నిరాకరించడం దేశ సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ, సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నప్పటికీ సత్సంబంధాలు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు నిలిచిపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని రానున్న పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావిస్తామని తెలిపారు. పెట్టుబడులు, విద్య, క్రీడల కోసం పర్యటన ఈ ఏడాది డిసెంబరులో హైదరాబాద్‌లో నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సులో పాల్గొనాల్సిందిగా అమెరికాలోని ప్రముఖ సంస్థలు, విశ్వవిద్యాలయాలను ఆహ్వానించేందుకు అమెరికా పర్యటనను ఖరారు చేసుకున్నామని రేవంత్‌రెడ్డి వివరించారు. తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యాలకు అనుగుణంగా విద్య, క్రీడలు, పెట్టుబడుల రంగాల్లో అవకాశాలను పెంచేందుకు ఈ పర్యటనను రూపొందించినట్లు తెలిపారు. 2034 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక లక్ష కోట్ల డాలర్ల స్థాయికి, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని చెప్పారు. గుజరాత్ పర్యటనకు అనుమతించి తెలంగాణకు ఎందుకు నిరాకరణ? పెట్టుబడుల కోసం గుజరాత్ ముఖ్యమంత్రికి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటనకు ఎందుకు అనుమతి నిరాకరించిందని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇంగ్లండ్ పర్యటనకు అనుమతించి, ఆ తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడం వెనుక కారణమేంటని నిలదీశారు. ఇంగ్లండ్ పర్యటనలో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ లండన్, లండన్ బిజినెస్ స్కూల్ ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. తెలంగాణలో కొన్ని స్వల్పకాలిక కోర్సులు ప్రారంభించే అంశాన్ని ఆయా సంస్థలు పరిశీలించేందుకు సానుకూలంగా స్పందించాయని చెప్పారు. విదేశీ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు ఆహ్వానించేందుకు ప్రయత్నం తెలంగాణ విద్యార్థులు అమెరికా, బ్రిటన్‌లోని విశ్వవిద్యాలయాల్లో చదువుకోవడానికి భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. విదేశీ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తున్నప్పటికీ, మరింత మెరుగైన విద్యా అవకాశాల కోసం ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు ఆహ్వానించాలని భావిస్తున్నట్లు తెలిపారు. విద్య, క్రీడలు, పెట్టుబడుల రంగాల్లో భాగస్వామ్య అవకాశాల కోసం అమెరికా పర్యటనకు సంబంధించిన వివరాలను కేంద్ర విదేశాంగ శాఖకు స్పష్టంగా తెలియజేశామని చెప్పారు. విదేశీ పర్యటనల్లో ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు పర్యటనను పర్యవేక్షిస్తాయని, సమావేశాల్లో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు అందిస్తాయని వివరించారు. డిసెంబరులో నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సుకు సంస్థలు, విద్యాసంస్థలను నాలుగైదు నెలల ముందుగానే ఆహ్వానించాల్సి ఉంటుందని, అందుకే ముందస్తు ఏర్పాట్లలో భాగంగా అధికారులను పంపించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

## పుతిన్‌తో జైశంకర్ భేటీ.. ప్రధాని మోదీ 'పర్సనల్ మెసేజ్' అందజేత

భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ సోమవారం మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంపిన 'వ్యక్తిగత సందేశాన్ని' ఆయన పుతిన్‌కు అందజేశారు. అయితే ఆ 'పర్సనల్ మెసేజ్'లో ఏముందన్నది ఆయన వెల్లడించలేదు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలతో పాటు అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతలు లోతుగా చర్చించారు. భారత్-రష్యా మధ్య వాణిజ్యం, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, సాంస్కృతిక సహకారంపై జరిగిన 27వ అంతర్-ప్రభుత్వ కమిషన్ (×=×+జ-ుజుజ) సమావేశం వివరాలను జైశంకర్, ఈ సందర్భంగా పుతిన్‌కు వివరించారు. రష్యా ఉప ప్రధాని డెనిస్ మాంటురోవ్‌తో కలిసి జైశంకర్ ఈ సమావేశానికి సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ, భారత్-రష్యా మధ్య చిరకాలంగా అత్యంత దృఢమైన సంబంధాలు కొనసాగుతున్నాయని ప్రశంసించారు. గతేడాది స్వల్పంగా తగ్గిన ద్వైపాక్షిక వాణిజ్యం, ఈ ఏడాది తిరిగి వృద్ధి పథంలోకి రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వహించడం వల్లే ఇది సాధ్యమైందని పుతిన్ పేర్కొన్నారు. తన తరపున ప్రధాని మోదీకి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేయాలని

# ప్రమాదంలో గాయపడిన నాయకురాలు,

● అడ్వకేట్ మహేశ్వరీకి, ● జిల్లా అధికార ప్రతినిధి గురురాజ్ దేశాయ్ పరామర్శ...

ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగష్టు 24. బైక్ ప్రమాదంలో గాయపడి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న బీజేపీ నాయకురాలు, అడ్వకేట్ మహేశ్వరీని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి



గురురాజ్ దేశాయ్ పరామర్శించారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలోని మహేశ్వరీ స్వగృహానికి వెళ్లిన ఆయన, ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ప్రమాదం జరిగిన తీరుతో పాటు ప్రస్తుతం అందుతున్న వైద్య సేవల వివరాలను మహేశ్వరీ భర్త కేశవ ని అడిగి తెలుసుకున్నారు. మహేశ్వరీ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితాన్ని కొనసాగించాలని గురురాజ్ దేశాయ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.మహేశ్వరీ ఆరోగ్య పరిస్థితిపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామన్న గౌడ్ , బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు గాజుల సురేంద్ర , బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి , కల్లెలు శివ , శివ , పంపయ్య గారు , అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు. మహేశ్వరీని పరామర్శించి, ఆమె త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

# వక్ఫ్ బోర్డు సమస్యలను మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లిన పలమనేరు ముస్లిం మైనార్టీ నాయకులు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయం నందు





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని పలమనేరు నియోజకవర్గానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలమనేరు పరిధిలోని వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ మరియు స్థానిక సమస్యలపై మంత్రి ఫరూక్ కి సమగ్రంగా వివరించి వినతిపత్రం అందజేశారు. సమస్యలను సావధానంగా విన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్ , వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అధికారులతో సమీక్షించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు న్యాయమతుల్లా, అబ్దుల్ ఖాదర్, సయ్యద్ మస్తాన్, రామచంద్రయ్య, ఆనంద్ బెన్ పాల్గొన్నారు.

# అపరిచితులతో అప్రమత్తం:శక్తి టీం



మహానంది, పల్లె వెలుగు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని నంద్యాల శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ డిఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మహానంది మండలం గోపవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్, 112, పిల్లలపై జరిగే నేరాలు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్, టెలిగ్రామ్, స్నాప్చాట్, అపరిచితులతో చాటింగ్ చేయవద్దన్నారు.గుర్తుతెలియని వ్యక్తుల వద్ద ఏ తినుబండారాలు తీసుకోవద్దన్నారు. శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకుంటే ఆపద సమయంలో మీ వెంట పోలీసులు ఉన్నట్లే అన్నారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులు,ఉపాధ్యాయులకుపోలీసులకు గాని తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఫరూక్‌ను కలిసిన ఎంపీ శబరి.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి సోమవారం నంద్యాలలోని మంత్రి ఎన్ఎండి ఫరూక్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నంద్యాల నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. నియోజకవర్గ ప్రగతికి సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి ఫరూక్ తెలిపారు.

# అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలి

● గడువులోగా వినతుల పరిష్కారానికి చర్యలు ● భూసమస్యలపై క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరి ● పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశం





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడి, వారి సమస్యలను సంతృప్తికరంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ వినతులు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. స్పష్టమైన ఎండార్స్‌మెంట్: ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే స్పష్టమైన ఎండార్స్‌మెంట్‌తో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి. భూసమస్యలపై ప్రత్యేక దృష్టి: భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలపై అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపి వాస్తవ నివేదికల ఆధారంగా చర్యలు చేపట్టాలి.

రీ-ఓపెన్ కేసుల తగ్గింపు: గతంలో పరిష్కారం కాక మళ్లీ దాఖలైన (రీ-ఓపెన్), అసంతృప్తికర పరిష్కారం (ఇంప్రాపర్ రెడ్రెసల్)గా నమోదైన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, అలాంటి కేసులు పునరావృతం కాకుండా చూడాలి.

పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్: వివిధ శాఖల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వినతులను వెంటనే పరిష్కరించేలా సంబంధిత శాఖాధికారులు బాధ్యత తీసుకోవాలి.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) సి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, శివ ప్రసాద్ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పోతిరెడ్డిపాడు వద్ద వైసీపీ నేతల అడ్డగింత దారుణం

☛రాయలసీమ నీటి హక్కుల సాధన కోసం ఎంతవరకైనా పోరాటం

☛రైతులపై పోలీసు దౌర్జన్యాలు తగవు

☛నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని రామభూపాల్ రెడ్డి ధ్వజం







పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాయలసీమ ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతులకు అందించకుండా ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి మండిపడ్డారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ను శాంతియుతంగా సందర్శించేందుకు వెళ్తున్న పార్టీ ముఖ్య నేతలను పోలీసులు మోహరించి అడ్డుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి శైలజానాథ్‌తో పాటు అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాల కీలక నేతలను మార్గమధ్యంలోనే నిలువరించడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్వహణ, రైతుల ప్రయోజనాలపై గళమెత్తారు.

మేమేమైనా ఉగ్రవాదులమా?: పోతిరెడ్డిపాడు వద్ద ప్రస్తుత నీటి పరిస్థితిని స్వయంగా పరిశీలించి, ప్రాజెక్టు పూర్తి సామర్థ్యాన్ని ఎందుకు వినియోగించుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వెళ్తుంటే భారీగా బలగాలను మోహరించడం విడ్డూరమన్నారు. ప్రతిపక్ష నేతలను ఉగ్రవాదులు, నక్సలైట్ల తరహాలో చూడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టని విమర్శించారు. వైఎస్సార్‌తోనే సీమకు జలకళ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని రికార్డు స్థాయిలో పెంచి, గోరకల్లు రిజర్వాయర్‌ను నిర్మించి రాయలసీమకు నీటి భద్రత కల్పించారని గుర్తుచేశారు. ఆ స్థాయిలో నీటిని నిల్వ చేసుకునే సౌకర్యాలు ఉన్నా, ప్రస్తుత పాలకులు సీమ అన్నదాతల నోట్లో మట్టికొడుతున్నారని ఆరోపించారు.

ఎస్ఆర్‌బీసీకి నీరిచ్చి పంటలను కాపాడాలి: తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి రాయలసీమకు దక్కాల్సిన న్యాయబద్ధమైన వాటాను పూర్తిస్థాయిలో సాధించాలని డిమాండ్ చేశారు. తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు ఎస్ఆర్‌బీసీ (గా=దీజ)కి వెంటనే నీటిని విడుదల చేయాలన్నారు. దీనివల్ల భూగర్భ జలమట్టాలు పెరిగి, రైతులకు కనీసం ఒక పంట పండించుకునే వెసులుబాటు లభిస్తుందని పేర్కొన్నారు.

రైతులపై పోలీసుల బెదిరింపులు ఆపాలి: కర్నూలు జిల్లా పరిధిలో రైతులు పొలాల వద్ద అమర్చుకున్న విద్యుత్ మోటార్లను తొలగించడం, వారిపై బెదిరింపులకు దిగడం వంటి పోలీసు శాఖ చర్యలను వెంటనే నిలిపివేయాలని హితవు పలికారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు రైతులపై దౌర్జన్యం చేయడం తగదన్నారు.

రాయలసీమ నీటి హక్కులను కాపాడుకునేందుకు, రైతులకు జరుగుతున్న అన్యాయంపై అన్ని నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో విస్తృత చైతన్య సదస్సులు నిర్వహిస్తామని కాటసాని స్పష్టం చేశారు. అవసరమైతే అన్ని రాజకీయ పక్షాలు, రైతు సంఘాలు, ప్రజాసంఘాలను ఏకం చేసి భారీ ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. సీమ హక్కులను సాధించి రైతులకు న్యాయం జరిగేంతవరకు తమ పోరాటం ఆగబోదని తేల్చిచెప్పారు.

# కాపర్ వైర్ దొంగ అరెస్ట్

## 20వేల నగదు,మోటార్ సైకిల్ స్వాధీనం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 24: గత రెండు నెలలుగా రైతులు విద్యుత్ మోటార్లకు వేసుకున్న కాపరు వైర్లను అపహరించి అమ్మి సొమ్ము చేసుకుంటున్న కాపర్ దొంగ ఎట్టకేలకు పోలీసుల చేత చిక్కి కటకటాల పాలయ్యాడు. బండి ఆత్మకూరు మండలంలో బండి ఆత్మకూరు సంత జుటూరు పరమటూరు గ్రామాల సరిహద్దులలో రైతులు తమ పొలాలను నీటితో తడుపుకునేందుకు కాలువల వెంట విద్యుత్ మోటార్లు వేసుకొని నానా అవస్థలు పడ్డారు. రైతులు వేసుకున్న కాపరు వైర్ల విలువైనది కావడంతో దీని గుర్తించిన దొంగలు కొందరు తమ చేతికి పని చెప్పుకుంటూ వచ్చారు. అదును చూసి విడతలు విడతలుగా కాపరువైర్లను ఎత్తుకు వెళుతూ రైతులకు కంటిమీద కొనుక్కు లేకుండా చేశారు. కాపరు వైర్లను దొంగలు ఎత్తుకెళున్నప్పటికీ రైతులు మౌనంగా రోదిస్తూ తిరిగి కాపరువైర్లను తెచ్చుకొని పొలాలకు నీళ్ల పారించుకుంటున్నారు. దాదాపు 200కు పైగా రైతులకు సంబంధించిన కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. రైతుల నుండి అందిన ఫిర్యాదుల మేరకు,ఈ విషయంపై పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఉంచారు. నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ సుస్మితా రంగనాథన్ ఆదేశాల మేరకు, నంద్యాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి ఉత్తర్వుల మేరకు పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి రాత్రిపూట గస్తీ నిర్వహించారు. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు ఓ అనుమానితుడైన వ్యక్తిని, పోలీసులు గుర్తించి విచారించిన మేరకు కాపరు వైరు దొంగల బాగోతం అంతా బయటపడినట్లుగా తెలుస్తోంది. బండి ఆత్మకూరు మండలం పరిధిలో ఉన్న నారపురెడ్డి కుంటకు చెందిన ఆదెన్న, మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, గడివేముల మండలం బిలకల గూడూరు గ్రామానికి చెందిన సుంకన్న అను వ్యక్తులు బృందంగా ఏర్పడి కాపరువైర్లను దొంగతనాలు చేసి రైతులకు నష్టం కలిగించే పనులకు పూనుకున్నారు. ఈ కేసులో నిందితుడైన మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ ను అరెస్టు చేసి ఆతడి వద్ద 20 వేల రూపాయల నగదు తో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా ముద్దాయిని రిమాండ్ కు పంపడం జరిగిందని ఎస్ఐ జగన్మోహన్ పేర్కొన్నారు. ఈ కేసులో మిగతా ఇద్దరు దొంగలు పరారీలో ఉన్నట్లుగా తెలుస్తోంది.కాపర్ వైర్ దొంగలను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్ఐ జగన్మోహన్, పోలీసులను నంద్యాల జిల్లా ఎస్పీ అభినందించారు.

# విశ్వబ్రాహ్మణులకు రూ.25 వేల జీవన భృతి అందించాలి

☛మంత్రి సవితకు వినతిపత్రం అందజేత

☛ఆదుకోవాలని కోరిన కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో యంత్ర ఆధునికీకరణ, కార్పొరేట్ విస్తరణ వల్ల తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆలూరు నియోజకవర్గ పర్యటనకు వచ్చిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి, పంచవృత్తుల వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న విశ్వబ్రాహ్మణుల దుర్భర పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వృత్తుల సంక్షోభం: గ్లోబలైజేషన్, ఆధునిక యంత్రాల రాకతో స్వర్ణకార వృత్తిపై ఆధారపడిన కుటుంబాలు



పంచవృత్తులు పూర్తిగా దెబ్బతిన్నాయని, మరోవైపు మార్కెట్లో బంగారం ధరలు ఆకాశాన్నంటడంతో ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు.

రూ.25 వేల ఆర్థిక సాయం: జీవనోపాధి కోల్పోయిన ప్రతి పేద విశ్వబ్రాహ్మణ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.25,000 వృత్తిపరమైన జీవన భృతి అందించి ఆర్థికంగా భరోసా కల్పించాలని కోరారు.

ఈ వినతిపై స్పందించిన మంత్రి సవిత, విశ్వబ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# దేశ సైనికులనురైతులను గౌరవించాలి

గురుకుల ప్రిన్సిపాల్ బోళ్ల స్రవంతి



పటాన్ చెరు, ఆగస్టు 24 పటాన్ చెరు మండలంలోని చిన్న కంచర్ల గ్రామంలో బీసీ గురుకుల, మహాత్మా జ్యోతిబాపూలే, గురుకుల పాఠశాల, విద్యార్థులు తెలుగు జట్టు కృత్యంలో భాగంగా విద్యార్థులు రైతుల,సైనికుల వారి శ్రమను,గొప్పతనాన్ని గురించి వేషధారణలతో,కళారూపంలో ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి గురుకుల ప్రిన్సిపాల్ బోళ్ళ స్రవంతి, ఏటీపీ రేఖ లక్ష్మి,అనిల్ కుమార్, రాజస్వామి,పాల్గొన్నారు.ఈసందర్భంగా ప్రిన్సిపాల్ స్రవంతి మాట్లాడుతూ.. దేశానికి వెన్నుముక రైతు. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడే వారు సైనికులు, వారిద్దరూ లేకపోతే దేశ ప్రజలకు తిండి, దేశానికి రక్షణా ఉండదు. దేశంకోసం వాళ్ళిద్దరూ పడే శ్రమను వర్ణించడానికి ఎన్ని మాటలు అయినా సరిపోవు. అందుకే లాల్ బహదూర్ శాస్త్రి “జై జవాన్ –జై కిసాన్ “ అన్నారు. అని వారి యొక్క గొప్పతనం గురించి విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు, దేవులపల్లి రమేశ్,విజయ్ కుమార్, నాగరాజు, నగేష్, రాజేందర్, విద్యార్థులు ఉదయ్, పవన్, హర్షవర్ధన్, సాత్విక్, హర్షిత్, ఆదిత్య, ప్రణీత్ కుమార్, స్వితన్, క్రాంతి కిరణ్ జగదీశ్, నవతెజ్,తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక శంఖారావం పూరించిన దళితులు,,

జిల్లా కలెక్టరేట్ ముట్టడికి ,,


ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు:23 గ్రామాలలో దళిత గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కై కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (ఖవూా), ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా పిలుపునిచ్చిన సామాజిక శంఖారావం జిల్లా కలెక్టరేట్ ముట్టడికి సోమవారం ఎమ్మిగనూరు డివిజన్ నుండి దళితులు 10 వాహనాల్లో 150 మందికి పైగా కర్నూలు నగరానికి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. సోమవారం ఎమ్మిగనూరు శివారు ప్రాంతంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సి. గోవిందు, కె.వి.పి.ఎస్. మండల ప్రధాన కార్యదర్శి సోగనూరు సప్పోగు తిమ్మన్నలు జెండా ఊపి ప్రారంభించారు. గ్రామాలలో ఊరి వెలి వాడలలో జీవిస్తున్న దళితులకు చనిపోతే ఖననం చేసుకోవడానికి కనీసం ఆరడుగుల స్థలం లేకపోవడం శోచనీయమన్నారు. జీవో ఎంఎస్ నెంబర్ 1235 మేరకు ప్రత్యేక స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, మౌలిక వసతులు అయిన రోడ్లు,డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యం, త్రాగునీటి




సౌకర్యాలతో పాటు నిరుపేద దళితులకు ఇంటి నివేశన స్థలములు మంజూరు చేయాలని, హౌసింగ్ బోర్డు ద్వారా పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై సామాజిక శంఖారావం పూరించి రాజి లేని పోరాటాల కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు సుమాల ఆంథోనీ, గుడేకల్ ఆనందు, గుంటె ప్ప,సుమాల రాజు, చీరాల దొడ్డి లక్ష్మన్న, కలగొట్ల రంగన్న, రాము, ఈరన్న కడివెల్ల ప్రసాద్, గంగన్న, పెసలుదిన్నె రామన్న, మల్కాపురం లో కన్నా, నియోజకవర్గంగ్రామాల నుంచి కెవిపిఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# సమస్యల పరిష్కారానికి ప్రజావేదిక.

ప్రతి సోమవారం ప్రజావేదిక: అసిస్టెంట్ కమిషనర్.




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె. కళ్యాణి బాయ్ తెలిపారు.

మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చేందుకు ప్రజావేదిక ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, రహదారులు, పన్నులు, భవన నిర్మాణాలు తదితర సమస్యలను ప్రజలు ఈ వేదిక ద్వారా తెలియజేయవచ్చున్నారు.

ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావేదికకు ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందజేయాలని సూచించారు. అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కళ్యాణి బాయ్ తెలిపారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు బాధ్యతతో పనిచేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, ప్రజావేదికను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ కోరారు.

# చేట్లను నరికి పాఠశాల పై కఠిన చర్యలు తీసుకోవాల

-బిజెపి ప్రధాన కార్యదర్శి కశెట్టి చంద్రశేఖర్

నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 24 . నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి ఆధ్వర్యంలో గోస్పాడు మండలం బాబా నగర్ రహదారి వెంట ఉన్న 450 చెట్లను ఒక ప్రముఖ పాఠశాల స్వలాభం కోసం ఎందుకు చేశారో 450 చెట్లను నరికి వేయడమైనది పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ నిమిత్తం ప్రతి ఒక్కరు బాధ్యతగా భారతీయ జనతా పార్టీ జనతా వారధి తరపున జాయింట్ కలెక్టర్ ని కలిసి వినతి పత్రం బిజెపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కశెట్టి చంద్రశేఖర్ అందజేశారు.వారి మీద కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటండి దేశం మొత్తం మీద పిలుపుమేరకు లక్షల మొక్కలు కూడా నాటడమైనది అలాంటి సందర్భంగా 450 చెట్లు నరికి వేయడం చాలా బాధాకరమైన విషయము, స్పందించి వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరడమైనది .నరికిన ప్లేస్ లో మరలా 450 చెట్లను వారి చేత నాటించాలి అని కోరడమైనది. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సామాజిక న్యాయం - ఆత్మ గౌరవం కల్పించాలి.




● ఆరులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి. ● జి రాంజీ పథకాన్ని రద్దుచేసి పాత గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి. ● ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బి కే ఎం యు డిమాండ్ .

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా నంద్యాల పట్టణంలోని స్థానిక మండల తహసిల్దార్ కార్యాలయాలు ముందు ధర్నా నిర్వహించి మండల తాసిల్దార్ శ్రీనివాసులు కి వినతి పత్రము ఇవ్వడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి హరినాథ్, రాష్ట్ర సమితి సభ్యురాలు జి లక్ష్మీదేవి, డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి సోమన్న, ఏఐటియు సి పట్టణ అధ్యక్షులు డి శ్రీనివాసులు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి భూములు శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యస్. బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న పేదల వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, పేదలకు సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కల్పించాలని, ఆర్థిక, రాజకీయ రంగాల్లో కూడా పేదలకు స్థానం కల్పించాలని ఈనెల 6 నుండి 15వ తేదీ వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రచార పాద యాత్రలు జరిగాయి. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు దాటిపోయినప్పటికీ పేదల సంక్షేమం, విద్యా, వైద్యం, ఆరోగ్యం, ఆహార భద్రత, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. ఎన్నో దశాబ్దాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న గ్రామీణ పేదల చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా రద్దు చేసి, కొత్త చట్టాల ముసుగులో పేదలను నిరాశ్రయులను చేయాలనే ప్రయత్నం చేయడం దుర్మార్గము. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వి బిజి రామ్ జి చట్టాన్ని తెచ్చి పేదల నోట్లో మట్టి కొట్టడానికి ప్రయత్నం చేస్తున్నది. కొత్త చట్టం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు ముఖ ఆధారిత హాజరు పెట్టడం వల్ల ఐరిస్ విధానంతో అష్టకష్టాలు పడుతున్నారు.అష్ట కష్టాలు పడి పనులకు వెళ్లిన తర్వాత ఐరిస్ పడకపోతే ఉపాధి పని ఉండదని వెనక్కి రావలసి వస్తుంది. ఉపాధి పని కూడా సక్రమంగా పెట్టకుండా కూలీలను మోసం చేస్తున్నారు. చేసిన పనికి కూడా సకాలంలో డబ్బులు చెల్లించడం లేదు.ఇప్పటికీ అన్ని ప్రాంతాల్లో దాదాపుగా నాలుగు వారాల డబ్బులు ఇవ్వవలసింది. అటవీ హక్కుల సంరక్షణ చట్టం తో పాటు దళితులు, గిరిజనులు సాధించుకున్న చట్టాలను కూడా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కింది. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదల వ్యతిరేక ప్రభుత్వంగా నడుస్తున్నది.పి. ఎం ఏ వై కింద పేదలకు సరిపడా గృహాలు ఇవ్వడం లేదు, అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నది. గత ప్రభుత్వాల్లో పేదలు పోరాడి సాధించుకున్న అనేక కేంద్ర పథకాలను ఎత్తివేసి పేదలకు సంక్షేమాన్ని దూరం చేయడంలో మోడీ ప్రభుత్వం మొదటి స్థానంలో ఉన్నది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ హామీలతో పాటు అనేక వాగ్దానాలు పూర్తిగా పక్కన పెట్టి పేదలను మోసం చేయడంలో చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని నమ్మబలికి, నేటికీ సెంటు స్థలం కూడా పేదలకు ఇవ్వలేదని అన్నారు రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములు 22 ఏ లో పెట్టి వాటిని హోల్డ్ చేసి పేదల సాగులో, స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములకు ఆన్లైన్ లో అడంగల్, 1బి, ఒరిజినల్ రాకుండా చేసి, ప్రభుత్వ పథకాలకు పేదలను దూరం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు అన్నింటిని కారు చౌకగా పరిశ్రమలు, విండ్, సోలార్ మరియు కంపెనీల పేరుతో అప్పనంగా అప్పజెప్పడానికి ఉన్న శ్రద్ధ పేదలపై చంద్రబాబుకు లేదు. ఇప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో 33 లక్షలు ఎకరాలను హోల్డ్ చేసి పేదలను ప్రభుత్వ భూములనుండి దూరం చేయడానికి ప్రయత్నం చేస్తున్నది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని పేదలు ఎక్కడైనా ఇంటి నివాసం కోసం గుడిసెలు వేసుకుంటే ఆగమేఘాల మీద పోలీసు, రెవెన్యూ వ్యవస్థలను పంపి కూల్చి వేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలు తో పాటు ఇతర వాగ్దానాలు కూడా అరకొరగా అమలు చేసి 100% అమలు చేస్తున్నామని అబద్దాలు వల్లె వేస్తున్నారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వలన ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. పేదలు ఒక పక్క పనులు లేక వలసలు పోతున్నా, ఉపాధి హామీ పనులు కల్పించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కూలీలు పట్ల నిర్లక్ష్యం చేస్తున్నది. తక్షణమే కరువు ప్రాంతాల్లో పేదలు ఆదుకోవాలని, పేదలకు సామాజిక న్యాయం, ఆత్మగౌరం ఆర్థిక, రాజకీయ రంగాల్లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

మా డిమాండ్స్ :--

ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నుండి పేదలు, వ్యవసాయ కూలీలకు పనులు లేనందున తక్షణమే ఉపాధి హామీ పనులు మొదలుపెట్టి వలసలను ఆపాలి.

తీవ్ర కరువు పరిస్థితుల నుండి ఆదుకోవడానికి వ్యవసాయ కూలీలకు ప్రతి కుటుంబానికి నెలకు 10 వేల రూపాయలు కరువు పెన్షన్లతో పాటు అన్ని రకాల నిత్యవసర వస్తువులు ఉచితంగా అందించాలి. రాష్ట్రవ్యాప్తంగా పేద విద్యార్థినీ, విద్యార్థులకు ఫీజులు రద్దుచేసి, వారిని ఆదుకోవాలని కోరారు.

చంద్రబాబు ఎన్నికల హామీలో భాగంగా పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలి. రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలి. ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి. 22 ఏ లో పెట్టిన పేదల భూములకు ఒరిజినల్ అడంగల్, 1బి లు వచ్చేలా చేసి, అన్ని రకాల ప్రభుత్వ సహాయం అందించాలి. దశాబ్దాల తరబడి పేదల సాగులో వున్న అన్ని రకాల ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేసి ఆ భూములపై వారికీ సర్వ హక్కులు కల్పించాలి.

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరణ చేయాలి. అటవీ హక్కుల సంరక్షణ చట్టాన్ని సక్రమంగా అమలు పరిచి ఆదివాసీలు, గిరిజనులకు న్యాయం చేయాలి.

పేదలకు సామాజిక న్యాయం- ఆత్మగౌరవం కల్పించి ఆర్థిక రాజకీయ రంగాల్లో పేదలకు స్థానం ఇవ్వాలని అన్నారు.

అర్హ త కల్గిన నిరుపేదలందరికీ రేషన్ కార్డులు, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

# రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన హక్కు,

☛రిజర్వేషన్ల ను వ్యతిరేకించడం అంటే రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమే

☛డా.బి.ఆర్.అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న వెల్లడి



ఎమ్మిగనూరు. పల్లె వెలుగు ఆగస్టు 24 ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన హక్కు అని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో ఎస్సీ కాలనీ నందు గల తన స్వగృహంలో ఆంధ్రప్రదేశ్ ఎస్సీ బేడ,బుడగ జంగం రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎర్రకోట సంకుల మహాలింగప్ప బుడగ జంగం, ఆంధ్రప్రదేశ్ బేడ, బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రాక్షల దస్తగిరి బుడగ జంగం లతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత రాజ్యాంగంలో విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు కల్పించే ప్రధానమైన ఆర్టికల్స్ 15(4),15(5),16(4),16(4ఎ),330,332,340 లను ఎస్సీ,ఎస్టీ,బిసి,(ఓబిసి) వర్గాలకు,ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు (ఈడబ్ల్యూఎస్) అభ్యున్నతికి రక్షణ కల్పించే విధంగా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పొందుపరిచాడని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద రిజర్వేషన్లు రద్దు చేయాలని నిరసనలు తెలుపడాన్ని కదిరికోట ఆదెన్న తీవ్రంగా ఖండించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించడం అంటే భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమేనని మండిపడ్డారు. రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేసే వారిపై దేశద్రోహం కేసులు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బేడ బుడగ జంగం నాయకులు ధూపం అంజి బుడగ జంగం, గానిగ ప్రేమ్ కుమార్ బుడగ జంగం తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు నగరంలో శబ్ద కాలు ష్యంపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

## 55 వాహనాలపై ఎంవీఐ ఈ-చలాన్లు





పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారి ఆదేశాల మేరకు కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆధ్వ ర్యంలో సోమవారం ఓల్డ్ పీసీఆర్ సర్కిల్ పరిసర ప్రాంతాల్లో శబ్ద కాలుష్య నియంత్రణ పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అధిక శబ్దం చేస్తున్న 5 మోడిఫైడ్ సైలె న్సర్లు కలిగిన ద్విచక్ర వాహనాలను గుర్తించి, సైలెన్సర్లను తొలగించి స్వా ధీనం చేసుకున్నారు.అలాగే నిబంధ నలకు విరుద్ధంగా పెద్ద శబ్దంతో హారన్లు వినియోగిస్తున్న 50 ఆటోలను గుర్తిం చారు. హారన్ల ను తొలగించారు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన మొత్తం 55 వాహనాలపై ఎంవీఐ చట్టం ప్రకారం ఈ-చలాన్లు విధించారు.పాఠశాలలు, ఆసుపత్రులు, నివాస ప్రాంతాల్లో అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించే వాహనదారులపై కఠిన చర్యలు తీసు కుంటామని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు.మోడిఫైడ్ సైలెన్సర్లు, అధిక శబ్దం చేసే హారన్లను వినియోగించ కుండా వాహనదారులు ట్రాఫిక్ నిబంధ నలు పాటించాలని సూచించారు.

# వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలి..

మహానంది, పల్లె వెలుగు పేదలు,వ్యవసాయ కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే




పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజు, జిల్లా సమితి సభ్యులు రాజేశ్వరయ్య పేర్కొన్నారు.సోమవారం మహానందిలోని తహశీల్దార్ కార్యాలయంలో సీపీఐ మండల కార్యదర్శి సామెలు ఆధ్వర్యంలో తహశీల్దార్ పి.రమాదేవికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. పేదలు, వ్యవసాయ కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించాలన్నారు. ప్రతి కుటుంబానికి నెలకు రూ.10 వేలు కరువు పెన్షన్, నిత్యావసర వస్తువులను ఉచితంగా అందించాలని తెలిపారు.రాష్ట్రంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధి లేక వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఉపాధి చట్టాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని తెలిపారు. పేద విద్యార్థులకు ఫీజు రద్దు చేయాలన్నారు. పేదలకు మౌలిక వసతులతో పాటు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఆర్థిక సహాయం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి లక్ష్మణ్,శీను, దస్తగిరి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సామాజిక న్యాయం - ఆత్మ గౌరవం కల్పించాలి.

కొత్తపల్లి –✓ :పేదలకు సామాజిక న్యాయం,ఆత్మ గౌరవం కల్పించాలనీ ,అరులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, బికెఎంయు, సిపిఐ మండల కార్యదర్శి కేతం వెంకట శివుడు డిమాండ్ చేశారు సోమవారం మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో మండల డిప్యూటీ తాహాసిల్దార్ అరుణ మరియు ఎంపీడీవో మేరీకి వినతి పత్రము అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావం వలన వర్షబావ పరిస్థితిలో నుండి పేదలు వ్యవసాయ కూలీలకు పనులు లేనందున తక్షణమే ఉపాధి హామీ పనులు మొదలుపెట్టి వలసలు ఆపాలి తీవ్ర కరువు పరిస్థితులు నేపథ్యంలో ఆదుకోవడానికి వ్యవసాయ కూలీలకు ప్రతి కుటుంబానికి నెలకు పది వేల రూపాయలు ఇచ్చి కరువు పెన్షన్లతో పాటు అన్ని రకాల వస్తువులు ఉచితంగా అందించాలన్నారు రాష్ట్రవ్యాప్తంగా పేద విద్యార్థి విద్యార్థులకు ఫీజులు రద్దుచేసి వారిని ఆదుకోవాలి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలో భాగంగా పేదలకు గ్రామంలో 3 సెంట్లు పట్టణాల్లో 2 సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఇవ్వాలన్నారు రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలి ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి 22 ఏ లో పెట్టిన పేదల భూములకు ఒరిజినల్ అడంగల్ 1బి లు వచ్చేలా చేసి అన్ని రకాల ప్రభుత్వ సహాయం అందించాలి. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సిపిఐ మండల కార్యదర్శి కేత్ం. వెంకట్ శివుడు యాదవ్, బి సురేష్, లింగమయ్య, వెంకట లింగం, గోవిందు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంలో బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకూడదు.

☛పిజిఆర్ఎస్ కు 335 ప్రజా దరఖాస్తులు.

☛జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా స్వీకరించే ప్రజా అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఎ వెళ్లకుండా పరిష్కరించేలా చర్యలు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రామునాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రజా సమస్యల అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించేది లేదని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి జి ఆర్ ఎస్) పైఉ నిర్వహించిన సమీక్షలో జిల్లాలో 4,543 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండగా, 76 ఫిర్యాదులు రీ-ఓపెన్ కావడంపై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీల పరిష్కారంలో బియాండ్ ఎస్ఎల్ఎ వెళ్లడం ద్వారా జిల్లా ర్యాంకింగ్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందని, అధికారులు ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. అదే విధంగా రీ-ఓపెన్ అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అందులో భాగంగా ఆత్మకూరు ఆర్డీఓ పరిధిలో 527, నంద్యాల ఆర్డీఓ పరిధిలో 591 రీ-ఓపెన్ అర్జీలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్లు ఫిర్యాదుదారులకు సమగ్రంగా, సరైన సమాధానాలు ఇవ్వకపోవడం వల్లే అర్జీలు తిరిగి రీ-ఓపెన్ అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారుడికి సరైన పరిష్కారం అందించడంతో పాటు సముచితమైన సమాధానం నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.వచ్చే వారంలోగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పి జి ఆర్ ఎస్ అర్జీలన్నింటినీ సమన్వయంతో పరిష్కరించి,






రీ-ఓపెన్ అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

### రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 160 అర్జీల స్వీకరణ

భూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తంగా 160 దరఖాస్తులు స్వీకరించగా వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 3, అడంగల్ సవరణలకు సంబంధించినవి 7, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 16, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 61, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 41,



సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 13, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 19గా ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

### పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు

1) మిడ్తూరు మండలానికి చెందిన షేక్ ఫరీదా తను వైకల్యంతో బాధపడుతున్నానని తనకు సదరం సర్టిఫికేట్ మంజూరు చేయించగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు. 2) గోస్పాడు మండలం, పసురపాడు గ్రామానికి చెందిన కొడతలపల్లె రాజారావు వృద్ధాప్య పింఛను మంజూరు చేయించగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు. 3) డోన్ మండలం, యు.కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు ఎస్.నజీర్ బాషా ప్రభుత్వం రైతులకు ఇస్తున్న ఆర్థిక సహాయం రైతన్న మీ కోసం క్రింద జమ అయ్యే నగదు జమ కాలేదని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

# జలధార -జలహారతి పనులను నిర్దేశిత గడువులోగా

## పూర్తి చేసి, పనులలో పురోగతిని పెంచాలి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జలధార-




జల హారతి పనులను వేగవంతంగా ప్రారంభించి, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పెంచాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా ఆదేశించారు.

సోమవారం ఉదయం పీజీఆర్ఎస్ హాలు నందు త్రాగునీరు, జలధార- జల హారతి కార్యక్రమం అమలు, పనుల ప్రగతిపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జలధార కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మొదటి విడత జలధార - జల హారతి కార్యక్రమం కింద జిల్లాలో 2,103 పనులను పూర్తి చేసి జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందినట్లు తెలిపారు. ఈ పనుల ప్రగతిని పరిశీలించేందుకు జాతీయ జల మిషన్ బృందం మిత్తూర్, జూపాడు బంగ్లా, నందికొట్కూరు మండలాల్లో పర్యటించనున్నట్లు వెల్లడించారు. రెండవ విడతలో మంజూరైన జల ధార పనులను కూడా వేగవంతంగా ప్రారంభించి, క్షేత్రస్థాయిలో పనులలో పురోగతిని పెంచాలని కలెక్టర్ ఆదేశించారు.ఆత్మకూరు, నంద్యాల, బండి ఆత్మకూరు, గోస్పాడు, మిత్తూర్ మండలాల్లో ఇంకా జీరో ప్రగతి నమోదు కావడంపై పై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పనులను ప్రారంభించి, ప్రతి పనికి జియో-ట్యాగింగ్ పూర్తి చేసి, ఫొటోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జలధార -జల హారతి కార్యక్రమం పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగం పెంచి, నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ప్రతి మండలంలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. తాగునీటి ఎద్దడి ఏర్పడినప్పుడు సమస్య పరిష్కారానికి గ్రామపంచాయతీ నిధులను వినియోగించాలన్నారు.

జలధార--జలహారతి కార్యక్రమాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేసి, జిల్లాను మెరుగైన పనితీరు కలిగిన జిల్లాల జాబితాలో ముందంజలో నిలిపేందుకు కృషి చేయాలని తెలిపారు.

# జనగణన హ్యాండ్‌బుక్ డేటా సేకరణ నాణ్యత తో చేపట్టాలి : జిల్లా కలెక్టర్

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జన గణన



హ్యాండ్‌బుక్ డేటా సేకరణ, వేకెంట్/లాక్డ్ ఇళ్ల సర్వే ప్రక్రియలపై జిల్లా కలెక్టర్, డిస్టిక్ సెన్సెస్ ఇంచార్జ్ అధికారిని విష్ణు మాధురి తో కలిసి సోమవారం కలెక్టరేట్ లోని పి జీ ఆర్ ఎస్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జనగణన హ్యాండ్ బుక్ డేటా సేకరణ నాణ్యత తో చేపట్టాలనీ, జనగణన హ్యాండ్‌బుక్ డేటా సేకరణ ప్రక్రియ ఈ నెల 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే వారం రోజుల సమయం పూర్తయినందున, మిగిలిన గడువులో వేగవంతంగా డేటా సేకరణను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

విలేజ్ డైరెక్టరీ, టౌన్ డైరెక్టరీ పరిధిలో విద్య, వైద్యం, భూమి, నీటిపారుదల, బ్యాంకింగ్, వ్యవసాయం తదితర 9 ప్రధాన విభాగాలకు సంబంధించిన సంఖ్యాత్మక సమాచారాన్ని కచ్చితంగా సేకరించి నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. విలేజ్ ఆఫీసర్లు, టౌన్ ఆఫీసర్లు తమకు కేటాయించిన డి సి హెచ్ బి యాప్/పోర్టల్‌లో సమాచారాన్ని నమోదు చేసి సమర్పించాలనీ అన్నారు. ఛార్జ్ ఆఫీసర్లు సెప్టెంబర్ 15 తర్వాత డేటాను పరిశీలించి ఆమోదిస్తారని, ప్రతి అంశానికి సంబంధించిన సమాచారానికి సంబంధిత శాఖను సమాచార మూలం గా స్పష్టంగా తెలపాలన్నారు. వేకెంట్/లాక్డ్ ఇళ్ల సర్వే జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 2,865 హెచ్ ఎల్ బి బ్లాకులకు గాను ఇప్పటివరకు 103 బ్లాకుల సర్వే పూర్తికాగా, 2,613 బ్లాకుల సర్వే ఇంకా పెండింగ్‌లో ఉందని తెలిపారు. హెచ్ ఎల్ ఓ యాప్‌లో నమోదైన ఖాళీ లేదా తాళం వేసిన ఇళ్లకు సంబంధించిన కారణాలను ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వలసలు లేదా ఇతర కారణాలను యాప్‌లో వెంటనే నమోదు చేసి ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. హెచ్ ఎల్ బి సర్వే ప్రక్రియను కూడా సెప్టెంబర్ 15 వ తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు, రాబోయే ఎన్నికల విధులు ఉన్నప్పటికీ, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ బి సి హెచ్ బి డేటా సేకరణ, హెచ్ ఎల్ బి సర్వే ప్రక్రియలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. నిర్దేశిత గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, డేటా ఖచ్చితత్వం, నాణ్యతను నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర జాతీయ స్థాయి అధికారుల తనిఖీల్లో జిల్లా వెనుక పడకుండా ఉండేందుకు ప్రత్యేక అధికారిగా విష్ణు మాధురి ప్రతి మండలాన్ని స్వయంగా సందర్శిస్తూ సిబ్బందికి శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు.

# గోస్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులను ఛేదించిన పోలీసులు

# అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్

**సుమారు 27 లక్షల విలువైన 173.540 గ్రాముల (17.354 తులాలు) బంగారు ఆభరణాలు, సుమారు 20 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం..**




పల్లె వెలుగు నంద్యాల క్రైమ్.



గోస్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇళ్లకు తాళాలు వేసి ఉన్న సమయంలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్‌జిల్లా దొంగలను గోస్పాడు పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 173.540 గ్రాముల (17.354 తులాలు) బంగారు ఆభరణాలు, సుమారు 20 తులాల వెండి ఆభరణాలు మరియు ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు నంద్యాల జిల్లా పోలీసులు తెలిపారు.

*2025 సంవత్సరం జూలై నెల 3 వ తేదీన రాత్రి సమయంలో గోస్పాడు మండలం, ఎస్. కూలూరు గ్రామంలో నివసిస్తున్న ఫిర్యాదిదారుడు గోపవరం సత్య నారాయణ రెడ్డి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటిలో దొంగతనం జరిగిందన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది.*

సదరు కేసులో నిందితుల ఆచూకీపై పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, గౌరవ నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాలమేరకు, నంద్యాల సబ్ డివిజనల్ ఏ ఎస్ పి సుస్మిత, ఐపీఎస్ పర్యవేక్షణలో, నంద్యాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసుల్ రెడ్డి మరియు గోస్పాడు యస్.ఐ పి. సుధాకార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం 23-08-2026న గోస్పాడు మండలంలోని సాంబవరం మెట్ట వద్ద గల చాబోలు మదార్ సా వెంచర్ వద్ద ఉన్న ముగ్గురు అనుమానితులు పోలీసులను గమనించి తప్పించుకునేందుకు ప్రయత్నం చేయగా అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా, సదరు వ్యక్తులు పై కేసులో తన ప్రమేయాన్ని స్వచ్ఛందంగా అంగీకరించారు. వాటితో పాటు జిల్లెల్ల, లింగాల, చాబోలు మరియు కడప జిల్లా, దిగువపల్లి గ్రామాల్లో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది.

సదరు నేరములకు సంబంధించి...

గోస్పాడు పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్. 46/2025, క్రైమ్ నెంబర్. 07/2026, క్రైమ్ నెంబర్. 43/2026;

రేవనూరు పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్. 28/2025;

నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్. 89/2026;

కడప జిల్లా వల్లూరు పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్. 50/2026 (అన్నీ యు/ఎస్ 331(4), 305(ఏ) (బి ఎం ఎస్) కేసులు నమోదు చేయబడినవి.

అనంతరం వారిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది మరియు నేరము చేయుటకు ఉపయోగించిన మోటార్ సైకిల్ హీరో స్ప్లెండర్ నెంబర్ ఎ పి27 బి డబ్ల్యు 0040 ను కుడా స్వాదిన పరుచుకోవడమైనది.

**అరెస్ట్ చేసిన ప్రదేశం :**

గోస్పాడు మండలంలోని సాంబవరం మెట్ట వద్ద గల చాబోలు మదార్ సా వెంచర్ వద్ద

**నిందితుడి వివరాలు:**

ఏ-1: నాగలూరు ఆదినారాయణ, వయస్సు 40 సంవత్సరాలు, ఏ-2: నాగలూరు యేసేబు ఏ తేజ, వయస్సు 27 సంవత్సరాలు,

ఏ-3: నాగలూరు శివ ఏ శివ కుమార్, వయస్సు 26 సంవత్సరాలు,

అందరిది కొత్తమాధవరం గ్రామం, ఒంటిమిట్ట మండలం, కడప జిల్లాకు చెందినవారు.

**స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు:**

దొంగిలించిన 173.540 గ్రాముల (17.354 తులాలు) బంగారు ఆభరణాలు, సుమారు 20 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం విలువ సుమారు రూ.27,00,000/- మరియు నేరము చేయుటకు ఉపయోగించిన మోటార్ సైకిల్ హీరో స్ప్లెండర్ నెంబర్ ఎ పి 27 బి డబ్ల్యు 0040.

**అరెస్టులో పాల్గొన్న అధికారులు:**

పి. సుధాకర్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, గోస్పాడు పి.యస్ .

గోస్పాడు పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కే.సి. చెన్నయ్య, పోలీస్ కానిస్టేబుళ్లు జిలాని బాష, నాగేంద్ర గౌడ్, డి. అశోక్, మధు సుధాకర్, శేఖర్ రెడ్డి డి. హుస్సేనయ్య మరియు హోంగార్డ్ కంబగిరి రాముడు పాల్గొన్నారు.

పై కేసులో ముద్దాయిని అరెస్టు చేసేందుకు కృషిచేసిన పోలీస్ అధికారులను సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి సుస్మిత ఐపీఎస్, నంద్యాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసుల్ రెడ్డి లు పాల్గొన్నారు.

**ప్రజలకు విజ్ఞప్తి :**

పగటి వేళల్లో వ్యాపారం పేరుతో గ్రామాలలో తిరుగుతూ ఇండ్లను, ఇంటి పరిసరాలను గమనించే అపరిచిత వ్యక్తులను, వారి వాహనాల నంబర్లను గమనించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా డయల్ 100 / 112 కు సమాచారం అందించాలని కోరారు. ఇండ్లకు తాళం వేసి ఎక్కువ రోజులు దూరంగా వెళ్ళే సమయంలో విలువైన ఆభరణాలను ఇంట్లో ఉంచక బ్యాంకు లాకర్ లో భద్రపరచుకోవాలని తెలిపారు. గ్రామస్తుల ఇలాంటి సమాచారమే దొంగతనాలను ముందుగానే నివారించడానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.

---

## జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎఫ్ ఐ ఆర్- 2026) ప్రక్రియపై ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ పర్యటన: జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. భారత ఎన్నికల సంఘం (ఈ సి ఐ) చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ( ఎస్ ఐ ఆర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026) ప్రక్రియలో భాగంగా నంద్యాల జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌గా నియమితులైన శ్రీమతి పి. ప్రశాంతి, ఐ.ఏ.ఎస్. గారు ఆగస్టు 25, 26 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నారు అని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు.ఆగస్టు 25 న ఉదయం 10 గంటలకు నంద్యాల నుంచి బయలుదేరి 134--ఆళ్లగడ్డ, 135--శ్రీశైలం, 139--నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు.



అనంతరం సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నంద్యాల ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం నంద్యాల లోనే రాత్రి బస చేయనున్నారు.ఆగస్టు 26న ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు జిల్లాలోని అన్ని ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లతో సమీక్ష సమావేశం నిర్వహించి ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పురోగతి, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలను సమీక్షించనున్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, కాలపరిమితికి అనుగుణంగా పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేసేందుకు అధికారులకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు ఇవ్వనున్నారు.

## సమాజ సేవకునికి ఘన సత్కారం




ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 24 పల్లె వెలుగు ఆళ్లగడ్డకు చెందిన అమ్మ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. బిజ్జల నగేష్ ను సోమవారం మండల అధికారులు ఘనంగా సత్కరించారు. అనాధ శవాలకు అంత్య క్రియలతో పాటు సమాజసేవయే పరమావధిగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నగేష్ డాక్టరేట్ పురస్కారంతోపాటు, పలు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్, మున్సిపల్ కమిషనర్ కిశోర్ లు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.

## బూజునురు గ్రామంలో ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన..

**జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వారి సహకారంతో178 మందికి ఉచిత వైద్య సేవలు.**
**ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల కన్వీనర్ పంట దిలీప్ కుమార్ రెడ్డి.**






గడివేముల పల్లెవెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా గడివేముల మండలం బుజనూరు గ్రామంలో గ్రామంలో ఉన్న ఎలిమెంటరీ స్కూల్ నందు ఉచిత వైద్య శిబిరంకు కర్నూల్ అమీలియా హాస్పిటల్ వైద్య బృందం చేత మరియు జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వారి సహకారంతో ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామ మండల టిడిపి కన్వీనర్ పంట దిలీప్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు, ఈ శిబిరానికి కర్నూలు నుంచి అమీలియో హాస్పిటల్ వైద్య సిబ్బంది మరియు వైద్య బృందం మరియు వైద్యవిద్యార్థులు పాల్గొని గ్రామంలో సుమారు 178 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి టాబ్లెట్లు , మందులు, మరియు సిరప్ మొదలగునవి పంపిణీ చేశారు, ఈ ఉచిత వైద్యం శిబిరం నందు ఉచిత జనరల్ చెకప్ మరియు గుండె , జ్వరము బిపి క్యాన్సర్ గర్భిణీ స్త్రీలకు పలు రకాలు వైద్య సేవలు గ్రామ ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా అమీలియో హాస్పిటల్ డాక్టర్స్ మాట్లాడుతూ గ్రామంలో చాలా పేషంట్లకు ఇప్పుడు చెక్ అప్ కంటి వైద్యం హార్ట్ కు సంబంధించినది ఈసీజీ జనరల్ చెకప్ ఉచితంగా నిర్వహించడం జరిగింది. మా హాస్పిటల్ నందు ఇన్సూరెన్స్ కంపెనీలతో భాగస్వామ్యంగా ఉంటూ ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీ తో పాటు క్యాష్ లెస్ సేవలు అందిస్తున్నామన్నారు, ఆర్తో, కార్డియాలజీ, ఆప్తమాలజీ ,జనరల్ సర్జరీ ,గైనకాలజీ ,జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్, యూరాలజీ, నెఫ్రాలజీ, డయాలసిస్ మరియు ఎమర్జెన్సీ మెడికల్ విభాగాలలో ప్రత్యేక వైద్య బృందంతో మా కర్నూల్ అమీలియా హాస్పిటల్ నందు సేవలందిస్తున్నామని అన్నారు, ఈ కార్యక్రమంలో జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ టీం విజయలక్ష్మి పాల్గొన్నారు.గ్రామంలోని రోగులకు సేవలు అందించిన అమీలియో హాస్పిటల్ బృందానికి, జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి గ్రామ ప్రజల తరపున మండల కన్వీనర్ దిలీప్ కుమార్ రెడ్డి వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో 113 ఫిర్యాదులు స్వీకరణ..

**ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు.**

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్.**



పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను జిల్లా ఎస్పీ గారు స్వయంగా విని, మొత్తం 113 ఫిర్యాదులను స్వీకరించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుదారుల సమావేశం వద్దకే వెళ్లి ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విని, సమస్యకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రజలు అందించిన ఫిర్యాదులను చట్టపరిధిలో పరిశీలించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఫిర్యాదిదారులకు భరోసా కల్పించారు.



అనంతరం సంబంధిత పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ పలు ఆదేశాలు జారీ చేశారు. చట్ట పరిధిలో పరిష్కరించగల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రతి ఫిర్యాదును నిర్ణీత గడువులోగా పరిష్కరించి, తీసుకున్న చర్యలకు సంబంధించిన పూర్తి వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి వేగవంతమైన పరిష్కారం అందించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలియజేశారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 95 ఫిర్యాదులు.



పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరి ష్కరించాలని పోలీసు అధికా రులను ఆదేశించిన జిల్లా ఎస్పీ. కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ వారి క్యాంపు కార్యా లయంలో కర్నూలు ఎస్పీ సోమ వారం ప్రజా ఫిర్యాదుల పరిష్కా ర వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతు లను స్వీకరించి ఫిర్యాది దారుల తో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక కార్యక్ర మానికి ఈ రోజు మొత్తం 95 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యా దులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్య లను త్వరితగతిన పరిష్కరి స్తామని ఈ సంధర్భంగా కర్నూ లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారు హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక కార్యక్ర మంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా సిఐలు శివశంకర్, పార్ధసారథి , మస్తాన్ వలి లు పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

- ప్రజలకు నగరపాలక సేవలు సులభంగా అందాలి
- ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 17 అర్జీలు
- కర్నూలు నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరపాలక సేవలు ప్రజలకు సులభంగా అందేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీలకు సంబంధించి 17 ఫిర్యాదులను స్వీకరించిన కమిషనర్, సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, కార్యదర్శి నాగరాజు, డిసిపి శబ్నం శాస్త్రీ, ఏసిపి నాగరాజు, ఎంఈ మనోహర్ రెడ్డి, ఆర్వోలు వాజిద్, క్రిస్టోఫర్, మంజూర్ బాష, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన

35వ వార్డులోని పలు కాలనీల్లో అభివృద్ధి పనుల ప్రారంభం

32, 35 వార్డుల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలపై ప్రచారం



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కల్లూరు అర్బన్ పరిధిలోని 35వ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా సుమారు రూ. 70 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పాణ్యం నియోజకవర్గ శాసనసభ్యురాలు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. 35వ వార్డు పరిధిలోని చింతల ముని నగర్, గనిగుంతలు, శివప్ప నగర్ ప్రాంతాలలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆమె స్థానిక నాయకులతో కలిసి శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి 32, 35 వార్డులలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందుతాయని ఆమె ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు రవి ప్రకాశ్ రెడ్డి, టైలర్ నాగరాజు, ఎన్వీ రామకృష్ణ, మైనారిటీ అధ్యక్షుడు ఎస్. ఫిరోజ్, తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, ఖాజా బందే నవాజ్, మురళి గౌడ్, సులేమాన్, ఏళ్ల నాగన్న, రమేష్, డిష్ మధులతో పాటు మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై అధ్యాపకులకు శిక్షణ

నంద్యాల: శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై ఐదు రోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం ప్రారంభమైంది. ఆధునిక సాంకేతికత, స్మార్ట్ పరికరాలు, స్వయంచలనంపై అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో డా. వై. మల్లికార్జునరావు, డా. పి. సురేంద్రబాబు, బి. అలేఖ్య హిమబిందు తదితరులు పాల్గొన్నారు.




# వైసీపీ పాలనలో రైతులకు నీటి కష్టాలు..

- కూటమి ప్రభుత్వంలో పంటలకు, ప్రజలకు నీరు,,,,
- వైసీపీ హయాంలో నీరు ఇవ్వని కాలువకు..
- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి నీటి విడుదల,,,,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 24 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు నియోజకవర్గ రైతులకు అండగా ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మరో కీలక ముందడుగు వేశారు. ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట గ్రామంలో వీ.న్యూ. మిట్ట సోమాపురం 1= కాలువకు సాగునీటిని విడుదల చేశారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ నీటి విడుదల ఎంతో ఊరటనిచ్చింది. కాలువ ద్వారా సుమారు 2,800 ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులకు నీరు అందడంతో పంటలను కాపాడుకునే అవకాశం కలిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. రైతుల పంటలు ఎండిపోతున్నా పట్టించుకోకుండా వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన వైసీపీ పాలనకు, కూటమి ప్రభుత్వం చేస్తున్న





పనులకు మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో రైతులు నీటి కోసం ఎదురుచూశారు.. కూటమి ప్రభుత్వంలో రైతుల పంటలను కాపాడేందుకు నీటిని విడుదల చేస్తున్నాం. రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఎమ్మిగనూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన ఆయకట్టు ప్రాంతాలకు కూడా ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా నీటిని అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ఏ పార్టీకి చెందిన వారైనా.. రైతు రైతే, నీరు ప్రతి రైతు హక్కు అనే విధానంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కాలువకు నీరు విడుదల కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల పంటలకు నీరు. గ్రామాలకు తాగునీరు. అభివృద్ధికి ప్రాధాన్యత ఇదే కూటమి ప్రభుత్వ విధానం ఈ కార్యక్రమంలో నాజ ఇజు, నాజు, వైస్ చైర్మన్, వాటర్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులు, ఏఎంసీ చైర్మన్, టీడీపీ మండల అధ్యక్షులు, నాయకులు, గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు

# కుమ్మరి వృత్తి రక్షణే మన సంస్కృతి ఆరోగ్య సంరక్షణ

పల్లె వెలుగు:మానవ నాగరికతకు కుమ్మరి




తొలిమెట్టు కుండ ఆరోగ్యానికి ఆయువు పట్టు ఆదిమ మానవుని నుండి ఆధునిక మానవ పరిణామ క్రమ చరిత్ర నిర్ధారణకు కుమ్మర వృత్తి సృష్టికి మూలాధారమై నిలిచింది శ్రమజీవి హస్తకళల నైపుణ్యానికి మట్టి ముద్ద ఒక నిదర్శనం కళాకృతులకు ప్రాణం పోసేసహజ సృజన కారులు కుమ్మర్లు కుమ్మరి చక్రం ఆధునిక పారిశ్రామిక ప్రగతికి మూలరూపమై నిలిచింది. ప్రాణమున్న మట్టిని తెచ్చిచక్రంపై పెట్టి చెమట చుక్కలు కలిపి జీవం పోస్తాడు. కుమ్మరి అగ్ని గర్భంలో కాలి రూపు దిద్దుకున్న మట్టి పాత్ర మానవ మనుగడను అందిస్తుంది. ప్రజలకు ఆరోగ్యాన్ని ఇస్తుందిరంజన్ మినరల్స్ విటమిన్స్ తో కూడిన నీరు ఇస్తుంది. సహజ సిద్ధమైన ఫిల్టర్ గా పనిచేసి శుద్ధ జలాన్ని నిల్వచేస్తుంది. మట్టి పాత్రలో వండిన వంట అమృతాహారం డయాబెటిక్ బీపీ క్యాన్సర్ లాంటి రోగాలు రాకుండా కాపాడి రోగనిరోధక శక్తిని పెంచుతుందినిరంతరం వాడితే థరి చేరదు అనారోగ్యం కుండ కేవలం నీటినిదాచుకునే పాత్ర కాదుఅది మన ఆరోగ్యాన్ని కాపాడే అమృత భాండం కుమ్మరి చక్రం కేవలం కుండల తయారీకే కాదుమానవ నాగరికతకు ఆరోగ్యకరమైన నడక నేర్పిందిమట్టి సేకరణ కష్టమై కుమ్మర వృత్తిదారులకు బ్రతుకు భారమైందిఆధునిక యంత్రాల వెల్లువలో కుమ్మర వృత్తి వెనుకబడిపోయింది. పెరిగిన ఉత్పత్తి ఖర్చులుమార్కెట్ సదుపాయాల కొరతతో కుమ్మర్ల బతుకు కుదేలైంది. కుమ్మరవృతి దారులు పేదరికం నిరుద్యోగంవృత్తికి ఆదరణ లేక కొట్టు మిట్టాడుతున్నారం. ప్రభుత్వాలు కదలాలికుమ్మర వృత్తికి అండగానిలవాలి. వృతి శిక్షణ ఇవ్వాలి. ఉచితంగా మట్టి తెచ్చుకునే హక్కును కల్పించాలి. మట్టి కుంటల్లో క్షేత్రస్థాయిసమస్యలనుపరిష్కరించాలి. ఆధునిక సాంకేతిక మద్దతుతో కొత్తయంత్రాలు అందించాలి. సబ్సిడీ రుణాలు ఇవ్వాలి. కాయకష్టం చేసే వృత్తిదారులకు ప్రమాద భీమా ఇవ్వాలి. అమ్ముకునే మట్టిపాత్రలకు మట్టి ఉత్పత్తులకు వృత్తి ధరల భీమా మద్దతు ఇవ్వాలి. మార్కెట్ ఇబ్బందులు తొలిగించిఅమ్మకాలు ప్రోత్సహించాలి. వృత్తి కళాకారులకు వార్షిక అవార్డులు ఇవ్వాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో మట్టి గ్లాసులు జగ్గులు వాడాలి . ప్రభుత్వ నర్సరీల్లో మట్టి తొట్టిలు మాత్రమే వాడేట్లు ప్రభుత్వం జివో జారీచేయాలి. కుమ్మరవృత్తి వృత్తిదారుల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపాలి. ప్లాస్టిక్ రసయనాల విషవలయంలో చిక్కుకున్న లోకానికి కుండ ఆరోగ్యానికి ఆయువుపట్టు కావాలి. ఆర్థిక సహాయం సాంకేతికత ప్రభుత్వ రక్షణ తోడైతే కుమ్మరి బతుకు వెలుగుతుంది మట్టి పాత్రల వాడకంతో ప్రజారోగ్యం సంరక్షించబడుతుంది. కుమ్మరి వృత్తికి ప్రభుత్వ భరోసాఇస్తే మానవ ఆరోగ్యానికి మట్టి పాత్రలు భద్రతను ఇస్తాయి. కుమ్మర వృత్తి దారులకు వృత్తి పరమైన ప్రమాద భీమా కల్పించాలి. ప్లాస్టిక్ విష సంస్కృతిని వీడి ప్రభుత్వ మద్దతుతో మట్టి పాత్రల ఉత్పత్తిని వినియోగాన్ని ప్రోత్సహిద్దాం శ్రమజీవులకు చేయూతనిద్దాం. తరతరాల కుమ్మరి సంస్కృతిని గౌరవిస్తూ ఆరోగ్యవంతమైన ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం. ప్రకృతి పర్యావరణ రక్షణకుప్రజారోగ్యానికి పాటు పడే కుమ్మర వృత్తికి పూర్వ వైభవం తెద్దాం చేతి వృత్తులకు చేయూత నిద్ధాం. నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం హైదరాబాద్.

# వినాయక చవితి పండుగ సందర్భంగా కమిటీ వారికి పోలీసువారి పలు సూచనలు..

గడివేముల ఎస్ఐ సిసి నాగార్జున్ రెడ్డి.





గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండల పరిధిలోగల అన్ని గ్రామాలలో వినాయక పండుగ సందర్భంగా వినాయకుని విగ్రహం ఏర్పాట్ల గురించి ఎస్సై నాగార్జున రెడ్డి కమిటీ వారికి ముందస్తుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు సూచనలు ఈ క్రింది విధంగా సూచించారు. వినాయక ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి,నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలుంటాయని పోలీసులు పోలీసు వారి హెచ్చరికలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ కొన్ని ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. గ్రామాలలో పెద్దపెద్ద విగ్రహాలను ఏర్పాటుచేసి నిమజ్జనం సమయంలో విద్యుత్తు తీగలకు గ్రామంలో ఎలాంటి అసౌకర్యాలకు కాకుండా ఉండే విధంగా గ్రహాలు ఏర్పాటు చేసుకొని ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని అదేవిధంగా మట్టి విగ్రహాలను కచ్చితంగా పాటించే విధంగా పలు సూచనలను తెలియజేస్తూ నిమజ్జనం మరియు ఊరేగింపు నియమాలునిర్దేశించిన మార్గాలలోనే విగ్రహాల ఊరేగింపు జరగాలి. నిర్ణీత సమయాల్లోనే నిమజ్జన ప్రక్రియ పూర్తి చేయాలి. రాత్రి సమయంలో డీజేలు, పెద్ద శబ్దాలతో కూడిన లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదు. అనుమతులు మరియు భద్రతమండపాల ఏర్పాటుకు స్థానిక పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. ట్రాఫిక్ కు అంతరాయం కలిగేలా రోడ్లపై మండపాలు పెట్టకూడదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాకుండా విద్యుత్ శాఖ వారి అనుమతులు కూడా తప్పనిసరిగా పాటించాలి అదేవిధంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాల వద్ద కమిటీ వారు, వలంటీర్లు ఎప్పుడూ ఉండాలి. శాంతిభద్రతలుమతరమైన మనస్తత్వాలు రెచ్చగొట్టేలా పాటలు లేదా మాటలు ఉండకూడదు. బాణసంచా కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండాలి. ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇక్కడ ఎలాంటి మత ల గురించి రెచ్చగొట్టే విధంగా గొడవలు సృష్టించకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ నాగార్జున్ రెడ్డి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా ఆస్తులపై రాజకీయ కబ్జా ఆపాలి..
# ప్రజా ఆహార భద్రతకు విఘాతం కలిగించవద్దు.

## నూనెపల్లె మార్కెట్ యార్డులో రాజకీయ పార్టీకి కేటాయించిన 2 ఎకరాల భూమిని రద్దు చేయాలి.

**☛ఆర్ ఏ ఆర్ ఎస్ ను కాపాడాలి.. తాత్కాలిక కలెక్టరేట్‌ను తక్షణమే తరలించాలి.**

**☛అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను తక్షణమే తరలించి, పరిశోధనా కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వ్యవసాయ పరిశోధనకు వినియోగించాలని అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేసింది.

ఆర్ ఏ ఆర్ ఎస్ నుంచి తక్షణమే కలెక్టర్ కార్యాలయాన్ని తరలించాలనీ, నూనెపల్లె మార్కెట్ యార్డులో రాజకీయ పార్టీకి కేటాయించిన రెండు ఎకరాల భూ కేటాయింపును రద్దు చేయాలని కోరుతూ రెండు వేర్వేరు పిటిషన్లను సోమవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ యస్) లో ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వేదిక నాయకులు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు అందచేసారు.

**అనంతరం ఐక్యవేదిక నాయకులు మీడియాతో మాట్లాడుతూ**

125 ఏళ్ల వ్యవసాయ పరిశోధనా వారసత్వానికి ఆర్ ఏ ఆర్ ఎస్ ప్రతీక అని, కరువు ప్రాంత రైతులకు ఉపయోగపడే వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో ఇది కీలక పాత్ర పోషించిందని నాయకులు తెలిపారు. ఐదేళ్లుగా కలెక్టరేట్ కొనసాగడం వల్ల పరిశోధనా వాతావరణం దెబ్బతింటోందని, ఆర్ కే వి వై, నాబార్డ్ తదితర నిధులతో ఏర్పాటు చేసిన ప్రయోగశాలలు, పరిశోధనా మౌలిక వసతులను తిరిగి పూర్తిస్థాయిలో వ్యవసాయ పరిశోధనకే వినియోగించాలని కోరారు.

అదేవిధంగా, నూనెపల్లె మార్కెట్ యార్డులో రైతుల ప్రయోజనాల కోసం ఉద్దేశించిన 2 ఎకరాల భూమిని రాజకీయ పార్టీ కార్యాలయానికి కేటాయించడం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ భూమిని తిరిగి మార్కెట్ యార్డు పరిధిలోకి తీసుకువచ్చి గోదాములు, కోల్డ్ స్టోరేజ్, ఈ-ట్రేడింగ్, ఇతర రైతు వసతులు ఏర్పాటు చేయాలని కోరారు.

ఒకవైపు శాశ్వత కలెక్టరేట్ నిర్మాణానికి భూమి అందుబాటులో లేదని ప్రభుత్వం చెబుతూ, మరోవైపు రైతుల ప్రయోజనాల కోసం ఉద్దేశించిన మార్కెట్ యార్డు భూమిని రాజకీయ పార్టీకి కేటాయించడం విధానపరమైన విరుద్ధత కాదా? అని అఖిలపక్ష ఐక్యవేదిక ప్రశ్నించింది.

గతంలో ఇదే మార్కెట్ యార్డు భూమి రైతుల ప్రయోజనాలకు అత్యంత కీలకమని అధికారులు న్యాయస్థానంలో పేర్కొన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు అదే భూమిని రాజకీయ పార్టీకి కేటాయించడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**"ప్రజా ఆస్తులు ఏ రాజకీయ పార్టీ ఆస్తులు కావు.. అవి ప్రజల ఆస్తులు. వ్యవసాయ పరిశోధనను రక్షించడం, రైతుల భవిష్యత్తును కాపాడటం, భావితరాల ఆహార భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత" అని నాయకులు పేర్కొన్నారు.**

**అఖిలపక్ష ఐక్యవేదిక ప్రధాన డిమాండ్లు.**

ఆర్ ఏ ఆర్ ఎస్ ప్రాంగణంలోని తాత్కాలిక కలెక్టరేట్‌ను తక్షణమే ప్రత్యామ్నాయ స్థలానికి తరలించాలి. ఆర్ ఏ ఆర్ ఎస్ లోని ప్రయోగశాలలు, పరిశోధనా మౌలిక వసతులను పూర్తిగా వ్యవసాయ పరిశోధనకే వినియోగించాలి. నూనెపల్లె మార్కెట్ యార్డులో రాజకీయ పార్టీకి కేటాయించిన 2 ఎకరాల భూమి కేటాయింపును తక్షణమే రద్దు చేయాలి.

సదరు భూమిని తిరిగి మార్కెట్ యార్డు పరిధిలోకి తీసుకువచ్చి గోదాములు, కోల్డ్ స్టోరేజ్, ఈ-ట్రేడింగ్ వంటి రైతు వసతులు ఏర్పాటు చేయాలి.

ఆ స్థలంలో జరుగుతున్న రాజకీయ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా కలెక్టర్ ఈ రెండు అంశాలపై తక్షణమే స్పందించి, న్యాయం చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక తరుపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంను రక్షించండి..రైతన్న భవిష్యత్తును కాపాడండి.. ప్రజా ఆస్తులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత ఈ నినాదంతో పట్టణంలో ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ప్రభుత్వం ఈ అంశాలపై సానుకూలంగా స్పందించకపోతే వాడవాడలా ఈ అంశాలను ప్రజల దగ్గరకు తీసుకెళ్ళి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, న్యాయవాది శంకరయ్య, రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, ఎస్ డి పి ఐ నాయకులు మజీద్, యాగంటి బసవేశ్వర రైతు సంఘం నాయకులు ఎం సి కొండారెడ్డి, సిపిఎం నరశింహులు, ముస్లిం ఐక్యవేదిక జిల్లా వైస్ ప్రెసిడెంట్ షేక్ పెద్ద మున్నా, సిపిఐ సోమన్న, పట్నం రాముడు, రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్ తో ఆగిన యువగుండె



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 24: బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా యువ గుండె ఆగిపోయింది. బ్రెయిన్ స్ట్రోక్ గురై నెల రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మనోహర్ అనే సైట్ ఇంజనీర్ మృతి చెందాడు. గడివేముల మండలం కరిమద్దెల గ్రామానికి చెందిన మనోహర్(30) తండ్రి చిన్నతనంలోనే చనిపోవడంతో, బండి ఆత్మకూరు కు చెందిన మేనత్త ఎల్లమ్మ ( విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ ) చేరదీసింది. ఎంతో ఉన్నతంగా చదివించి 16 నెలల క్రితం వాడాలకు చెందిన మానసతో ఘనంగా వివాహం జరిపించింది. మనోహర్ ఓర్వకల్లు మండలంలో రిలయన్స్ కంపెనీ నిర్వహిస్తున్న క్యాంపా లో సైట్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు. నెలరోజుల క్రితం ఉన్నట్టుండి మనోహర్ తెల్లవారుజామున బ్లడ్ ప్రెషర్ ఎక్కువై బ్రెయిన్ స్ట్రోక్ కు గురైయ్యాడు. దీనితోపాటు పక్షవాతానికి కూడా గురి కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో తిరిగి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మనోహర్ సోమవారం చెందాడు. మనోహర్ భార్య ఏడు నెలల గర్భవతి అని తెలుస్తోంది. భర్త మృతి చెందాడు అన్న విషయం తెలిసిన వెంటనే భార్య సొమ్మసిల్లి పడిపోయింది. తన ఒక్కగానొక్క మేనల్లుడు మృతి చెందడంతో, మేనత్త ఎల్లమ్మ గుండెలు పగిలేలా రోదిస్తూ ఉండటంతో తోటి మహిళలు కూడా కన్నీరు మున్నీరు అయ్యారు. ఎలాంటి దురలవాట్లు లేని మనోహర్ బ్రెయిన్ స్ట్రోక్ గురై మృతి చెందిన సంఘటన అందరిలోనూ ఆందోళన కలిగిస్తుంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలుపుగోలుగా ఉండే మనోహర్ మరణాన్ని స్నేహితుడు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. మనోహర్ స్వగ్రామం గడివేముల మండలం కరిమద్దెల కావడంతో దేహాన్ని అక్కడికి తరలించారు.

**ఒత్తిడికి కారణాలు ఎన్నో!**

మానవుల జీవన శైలిలో ప్రస్తుతం ఒత్తిడి సర్వసాధారణమైపోయింది. విధి నిర్వహణలో క్రింది స్థాయి ఉద్యోగులు మొదలుకొని, సాధారణ మానవులు సైతం వొ త్తిడికి గురి అవుతూ ఉన్నారు. ఇందుకు కారణాలు ఎన్నో ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఒత్తిడి కారణంగా మెదడులో రక్తనాళాలు గూడు క ట్టుకోవడం, రక్తప్రసరణ ఆగిపోవడం, కండరాల వ్యవస్థ క్షీణించి పోవడం, చిన్న మెదడులో గుడి భాగానికి ఎడమ భాగానికి అనుసంధానం చెయ్యడం లాంటి సంఘటనలు జరగటంతో పాటు కుడి పక్క ఉన్న మెదడు పక్కకు జరిగే పరిస్థితి ఉంటుందని వైద్యాధికారి దినేష్ బాబు పేర్కొంటున్నారు. మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉండటం, షుగరు,మద్యపానం ధూమపానాలు లాంటి అలవాట్ల కారణంగా మెదడు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందని, ఈ కారణంగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో పాటు పక్షవాతంలాంటి సంఘటనలు కూడా జరుగుతాయని అంటున్నారు. తల కు ఎప్పుడైనా కనిపించని గాయాలు అయినప్పుడు, ఏమవుతుందిలే, అని నిర్లక్ష్యం వహించినప్పుడు మెదడులో రక్తనాళాలు గూడుకట్టుకొని బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగా, వ్యాయామం లాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు. ఆహార జీవనశైలిలో కూడా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని అంటున్నారు.ఒంటరిగా ఉండటంవల్ల ఆలోచనలు అధికమై మెదడు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందని, ఇలాంటి సందర్భాల్లో టెలి మానస్ హెల్ప్ లైన్ నెంబర్ కు ఫోన్ చేస్తే వారు ఈ విషయంపై కౌన్సిలింగ్ నిర్వహించే అవకాశం ఉంటుందని వైద్యాధికారి దినేష్ బాబు పేర్కొన్నారు.

# పంటలను పరిశీలించిన
## వాస్సర్ ల్యాబ్ విజయవాడ బృందం





బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 24 : బండి ఆత్మకూరు మండల పరిధిలోని అయ్యవారి కోడూరు, పరమటూరు, భోజనం, ఈర్నపాడు గ్రామాల్లో విజయవాడకు చెందిన వాస్సర్ లాబ్స్ ఎపి ఎఐఎంఎస్ సాంకేతిక నిపుణులు సోమవారం క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించారు. ఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతులకు అందిస్తున్న వాతావరణ సూచనలు తుఫాను మరియు కరువు హెచ్చరికలు యాప్ పనితీరు వాసర్ ల్యాబ్ సాంకేతిక సిబ్బంది సాయి చరణ్, తిరుపతి, సమన్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట సాగు విస్తీర్ణం పంట ఆరోగ్య స్థితి మరియు యాజమాన్య పద్ధతులపై సమాచారము రైతులకు యాప్ ద్వారా పొందవచ్చని వారు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో రైతుల సాగు చేసిన పంట పొలాలు యొక్క ఆరోగ్య స్థితి యాప్ లో అప్రమతంగా వచ్చిన పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ శాఖ ద్వారా వస్తున్న వాతావరణ సందేశాలు మరియు పంట స్తితి గతులు రైతులకు అవగాహన కల్పించి వెంటనే చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను పంపుతున్నామని వారు తెలిపారు. యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో తీసుకున్న వాస్తవాలను మరియు అభిప్రాయాలను ప్రభుత్వానికి చేరవేస్తామని వారు తెలిపారు.

**వంద శాతం ల్యాండ్ పార్సెల్ బుకింగ్ చేయాలి**

ఈ ఖరీఫ్ 2026న రైతులు సాగుచేసిన పంట పొలాలతో పాటు బీడు భూములు కలిగిన ల్యాండ్ పార్సెల్ ను ఈ పంట యాప్ లో బుకింగ్ చేయాలని సిబ్బందిని ఏఓ పవన్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఏఈఓ లక్ష్మయ్య, వ్యవసాయ విస్తరణ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ,అంజలి పలువురు రైతులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో సంక్షేమ విప్లవం: పార్వతమ్మ
### 37వ వార్డులో ఘనంగా 'డోర్ టు డోర్' ప్రచారం
### రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ ఫలాలపై విస్తృత ప్రచారం



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నంద్యాల 37వ వార్డు బొరుగుల లైన్ పరిధిలో 'డోర్ టు డోర్' ప్రచార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ ఆధ్వర్యంలో వార్డులోని 79, 80, 82, 87, 88 బూత్‌లలో ఈ పర్యటన సాగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పార్వతమ్మ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ పర్యటనకు స్థానిక ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది.

కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జ్ సుతారు రాఘవేంద్ర, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, నాయకుడు ఇమ్మానియేల్ (గిడ్డయ్య), యూనిట్ ఇన్‌ఛార్జ్ ఖాదర్ వలి, బూత్ ఇన్‌ఛార్జ్‌లు బాలకృష్ణ, సుబ్బరాయుడు, గడ్డం వెంకటేష్, నాగ మద్దులు, అనిల్, బసన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం: ఎస్పీ

పాణ్యం ఆగస్టు 24 పల్లె వెలుగు : విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని,అప్పుడే భవిష్యత్కు మంచి మార్గం ఏర్పడుతుందని



ఎస్పీ సునీల్ షోరాణ్ అన్నారు.మండలంలోని సుగాలి మెట్ట వద్దగల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని జిల్లా ఎస్పీ సోమవారం సందర్శించారు.ఎస్పీ మాట్లాడుతూ అందరికీ అన్ని అంశాలు తెలియవని, ప్రతిరోజూ చదివితేనే తెలియని అంశాల మీద పట్టు సాధించవచ్చన్నారు. ప్రతి పోటీ పరీక్షలో మ్యాథ్స్ తప్పనిసరిగా ఉంటుందని,ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకంలోని అంశాలను నేర్చుకుంటే గణితంలో ఉండే లెక్కల సాధన సులభతరమవుతుందన్నారు.ప్రణాళికా ప్రకారంగా ఉపాధ్యాయులు అన్నీ బోధించాలన్నారు.ముఖ్యంగా బాలికలు 'మంచి స్పర్శ, చెడు స్పర్శ' పట్ల అవగాహన కలిగి ఉండాలి.ఏవైనా వేధింపులు ఎదురైతే వెంటనే ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలపాలి.పాఠశాల వయసులో అనవసరంగా సెల్‌ఫోన్లు వాడుతూ, సమయాన్ని వృథా చేసుకోకూడదు. సినిమాలకు, శిఖార్లకు పరిమితం కాకుండా చదువుపై దృష్టి పెట్టాలి అని అన్నారు.సమస్యలు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com